సమావేశవు - VI
వాల్యూం - I
నెం. 1

వెల : రూ. 45-00
7 సెప్టెంబర్, 2020
సోమవారము,
(శక సం. 1942,
భాద్రపద బ. 5)

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

పేజి. నెం.

1. సంతాప ప్రతిపాదనలు ... 1

* * *

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	ః	శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి
ఉప సభాపతి	ః	శ్రీ టి. పద్మారావు
కార్యదర్శి	ః	డా. వి. నరసింహా చార్యులు
ఉప కార్యదర్శులు	ః	శ్రీ ఎస్. దుర్గాప్రసాద్
		శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి
		శ్రీమతి వి.ఎస్. ప్రసన్న కుమారి
సహాయ కార్యదర్శులు	ః	శ్రీ ఇ. సంజీవరావు శ్రీమతి బి. ప్రమీల శ్రీమతి ఎస్. నాగమణి శ్రీ డి. శ్రీనివాసులు శ్రీ ఎమ్. రఘుమారెడ్డి శ్రీ ఎ. సుధాకర్ శ్రీ పి. శ్రీనివాస్
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ కె. భాస్కర శ్రీనివాస్

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(2వ శాసన సభ)

(ఆరవ సమావేశము - మొదటి రోజు)

సోమవారము, సెప్టెంబర్ 7, 2020

(సభ ఉ.గం. 11.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

(సభ ప్రప్రథమంగా జాతీయ గీతాలాపనతో ప్రారంభమైనది)

మిస్టర్ స్పీకర్:- గౌరవ సభ్యులందరికి హృదయపూర్వక నమస్కారాలు. కరోనా వ్యాధి విజృంభిస్తున్న సందర్భంలో గౌరవ సభ్యులు కొన్ని సూచనలు పాటించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. శాసనసభ సమావేశానికి హాజరయ్యే ముందు సభ్యులు రోజూ జ్వరాన్ని తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలి. జ్వరం, దగ్గు, జలుబు వంటివి ఉన్నట్లయితే అవి తగ్గే వరకు ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాలి. సభ్యులందరూ తప్పక మాస్క్ ధరించాలి. సమావేశ మందిరంలో గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలి. తరచుగా చేతులను సబ్బు మరియు నీటితో కనీసం 20 సెకండ్ల నుంచి 40 సెకండ్ల వరకు శుభ్రపరచుకోవాలి. శానిటైజర్లను కూడా తప్పకుండా వినియోగిస్తూ ఉండాలి. టేబుల్స్, డోర్ హ్యాండిల్స్, హ్యాండ్ రేలింగ్స్ వంటి వాటిని తాకకుండా ఉండడం మంచిది. తన సహచర సభ్యులకు ఆరు అడుగులు దూరం ఉండేలా చూసుకోవాలి. తుమ్మిన మరియు దగ్గిన సందర్భాలలో రుమాలును అడ్డుపెట్టుకోవాలి. మొబైల్ ఫోన్లు, ల్యాబ్ ట్యాప్స్, కంప్యూటర్ కీబోర్డు, మౌస్ వంటి పరికరాలను వాడినప్పుడు ప్రతి నాలుగు గంటలకు ఒకసారి శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలి. రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. సాధ్యమైనంతవరకు లిఫ్టలను ఉపయోగించరాదు. జ్వరం, దగ్గు, తుమ్ములు మరియు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండి అనారోగ్యంతో ఉన్న వారి దగ్గర ఉండకూడదు. ముఖ్యంగా కళ్లు, ముక్కు, నోటిని చేతితో తాకవద్దు. ఆహారం, నీటి సీసాలు ఇతరులతో పంచుకోరాదు. Now, I will take up the Condolence Motions that are listed in today's agenda. I request the Hon'ble Chief Minister to move the Condolence Motion of Sri Pranab Mukherjee, former President of India.

శ్రీ కె.చంద్రశేఖర రావు (గజ్వేల్):- అధ్యక్షా, భారతదేశ మాజీ రాష్ట్రపతి భారతరత్న శ్రీ ప్రణబ్ ముఖర్జీ గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయాలని నేను గౌరవ సభను అర్థిస్తున్నాను. భారతదేశ పూర్వ రాష్ట్రపతి, భారతరత్న, పద్మవిభూషణ్ శ్రీ ప్రణబ్ ముఖర్జీ గారి మరణంతో భారతదేశం ఒక శిఖర సమానుడైన నాయకుడిని కోల్పోయింది. అర్థ శతాబ్దంపాటు భారత రాజకీయాల్లో క్రియాశీలక భూమిక పోషించిన కర్మయోగి శ్రీ ప్రణబ్ ముఖర్జీ. 1970వ సంవత్సరం తరువాత భారతదేశ అభివృద్ధి చరిత్రలో ప్రణబ్ ముఖర్జీ గారి పేరు లేని పేజీ ఉండదంటే అది అతిశయోక్తి కాదు. ప్రణబ్ దాదా అని అందరూ గౌరవంగా

ఆత్మీయంగా పిలుచుకునే శ్రీ ప్రణబ్ ముఖర్జీ క్రమశిక్షణ, కఠోర శ్రమ అంకిత భావంతో అంచలంచెలుగా ఎదిగారు. పశ్చిమ బెంగాల్‌లోని చిన్న గ్రామమైన మిరాఠిలో 1935వ సంవత్సరం సెప్టెంబర్ 11వ తేదీన జన్మించిన ప్రణబ్ దాదా చిన్నప్పుడు తన ఊరికి దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్లడానికి ఒక చిన్న వాగును ఈదుకొని వెళ్లాల్సి వచ్చేది. ఆయన గొప్ప నేతగా ఎదిగిన తర్వాత రాజకీయ సముద్రాన్ని సమర్థవంతంగా ఈది భరతమాత ప్రియ పుత్రునిగా చరిత్రకెక్కారు. 1969వ సంవత్సరంలో రాజ్యసభ సభ్యునిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. చిక్కుముడులను విప్పి జఠిల సమస్యలను పరిష్కరించగల నేర్పరిగానే కాకుండా "Man of all seasons"గా గుర్తింపు పొందారు. కేంద్రప్రభుత్వంలో పరిశ్రమల శాఖ, షిప్పింగ్ రవాణాశాఖ, ఆర్థిక శాఖ, వాణిజ్య శాఖ, విదేశీ వ్యవహారాల శాఖ, రక్షణశాఖ మొదలైన శాఖల మంత్రిగా విశేషమైన సేవలను అందించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఆమూలాగ్రం అధ్యయనం చేసిన ప్రణబ్ దాదా ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ మొదలైన సంస్థలతో అత్యున్నత స్థాయిలో పని చేసిన ధీరుడు. చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చిన మహోన్నత రాజనీతిజ్ఞుడుగా ప్రపంచంలోనే ఐదుగురు అత్యుత్తమ ఆర్థిక మంత్రులలో ఒకరుగా కితాబును అందుకున్న మేధావి. భారత అమెరికా వ్యూహాత్మక సంబంధాలు తీర్చిదిద్దడంలో ప్రణబ్ దాదా ముఖ్య భూమికను నిర్వహించారు. సంకీర్ణ ప్రభుత్వాల శకం ప్రారంభమైన తర్వాత భారత రాజకీయాలలో ఏకాభిప్రాయ సాధకుడుగా ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమైనది.

సమన్వయం అవసరమైతే గుర్తు వచ్చేది ప్రణబ్ దాదానే. మిత్ర పక్షాలను కలుపుకుని వెళ్లడంలో విశ్వసనీయుడైన నేతగా కుడి, ఎడమలను సమన్వయం చేసుకున్న సవ్యసాచిగా ఆయన అందరి మన్నలను పొందారు. రాజకీయాలను, పార్లమెంటరీ నిబంధనలను అవపోశన పట్టిన రాజకీయ దురందరుడు శ్రీ ప్రణబ్ ముఖర్జీ. ఆయన ఎన్నడైనా ప్రతిపక్షాలను సిద్ధాంతపరంగానే తప్ప వ్యక్తిగతంగా విమర్శించే వారుకాదు. పార్లమెంట్‌లో మాట్లాడేటప్పుడు ఏదైనా తప్పు దొర్లితే వెంటనే సభను క్షమాపణ కోరేవారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలకు నిలువెత్తు ప్రతీకగా శ్రీ ప్రణబ్ ముఖర్జీ చరిత్రలో నిలచిపోతారు. భారతదేశ 13వ రాష్ట్రపతిగా అత్యుత్తున్నత పదవిని అధిష్ఠించిన ప్రణబ్ ముఖర్జీని జాతి నిర్మాణంలో ఆయన అందించిన విశిష్ట సేవలకుగాను 2019వ సంవత్సరంలో కేంద్రప్రభుత్వం భారతరత్న పురస్కారంతో సన్మానించింది.

11.10 ఉ. తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమ చరిత్రలో కూడా ప్రణబ్ ముఖర్జీ గారి పేరు ముడిపడి ఉన్నది. తెలంగాణ రాష్ట్రఏర్పాటుపై వివిధ పార్టీల అభిప్రాయ సేకరణ కోసం నియమించిన కమిటీకి ఆయన సారథ్యం వహించడమే కాకుండా ప్రజల ఆకాంక్షలను అధ్యయనం చేసి, పరిష్కారం కోసం ఆనాడు అధిష్టానానికి మార్గదర్శకం చేశారు. రాష్ట్ర అవతరణకు సహాయపడటమే కాకుండా, రాష్ట్రఏర్పాటు బిల్లు మీద ఆమోద ముద్ర వేసిన ఆనాటి రాష్ట్రపతిగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయారు. అనేకానేక రాజకీయ సంఘర్షణల నడుమ సైతం అజాత శత్రువుగా నిలిచిన ప్రణబ్ ముఖర్జీ గారు గత నెల 31వ తేదీన తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. భారత పూర్వ రాష్ట్రపతి, భారతరత్న ప్రణబ్ ముఖర్జీ గారి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర శాసనసభ తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ, ఏకగ్రీవంగా తీర్మానిస్తున్నది. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. ప్రణబ్ ముఖర్జీ గారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నది. ప్రజాస్వామ్యం, జాతీయవాదం, లౌకికత్వం అనే మూడు అంశాల ప్రాతిపదికగా ప్రణబ్ ముఖర్జీ గారి దృక్పథం రూపొందింది. ఆ విలువల కొనసాగింపుగా వారి జీవనయానం కొనసాగింది. ఆయన నమ్మిన విలువలను నిలబెడుతూ దేశాభ్యున్నతికి పాటుపడటమే ప్రణబ్ ముఖర్జీ గారికి మనం అందించగల నిజమైన నివాళిగా ఈ సభ భావిస్తున్నది.

جناب سید احمد پاشاہ قادری (JANAB SYED AHMED PASHA QUADRI, YAKUTPURA CONSTITUENCY):

جناب اسپیکر صاحب! سی ایم صاحب کی جانب سے تعزیت کی جو قرارداد پیش کی گئی ہے، میں اس کی تائید کرتا ہوں۔ ہمارے ملک کے سابق صدر جمہوریہ پرنب مکھرجی صاحب کے دیہانت پر افسوس کا اظہار کرتے ہوئے میں یہ کہنا چاہتا ہوں کہ ہندوستان کے کئی وزرائے اعظم گزرے ہیں جن میں چار، پانچ وزرائے اعظم کی کیبنٹ میں پرنب مکھرجی صاحب ایک ذمہ دار کی حیثیت سے وزارت پر فائز تھے اور ہر قلمدان پر بہترین خدمت کرتے رہے۔ وہ 2012ء سے 2017ء تک ملک کے صدر جمہوریہ کے جلیل القدر عہدے پر فائز رہے۔ پرنب مکھرجی صاحب کی 1935ء میں پیدائش ہوئی اور 2020ء میں ان کا انتقال ہوا۔ اس طویل عرصہ میں انہوں نے بے شمار خدمات انجام دیں۔ وہ متعدد مرتبہ انتخابات میں عوام کی خدمت کے لئے منتخب ہوتے رہے۔ کل ہند مجلس اتحاد المسلمین کی جانب سے میں ان کے افراد خاندان سے اظہار ہمدردی کرتا ہوں اور قرارداد تعزیت کی تائید کرتا ہوں۔ شکریہ۔

శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి (వనపర్తి):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు ప్రతిపాదించిన సంతాప తీర్మానాన్ని నేను మనస్ఫూర్తిగా బలపరుస్తున్నాను. వారు సంతాప తీర్మానంలో ఉటంకించిన విషయాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. అజాత శత్రువుగా, అపర మేధావిగా, చాణుక్యుడిగా సుదీర్ఘకాలం భారత ప్రజాస్వామిక రాజకీయాలలో ఐదు దశాబ్దాలలో ఐదు సార్లు రాజ్యసభ సభ్యులుగా, రెండు సార్లు లోక్‌సభ సభ్యులుగా, ఒకసారి ప్లానింగ్ కమీషన్ ఆఫ్ ఇండియాకి వైస్ ఛైర్మన్‌గా, ఒకసారి భారత రాష్ట్రపతిగా వారు అందించిన సేవలు అనన్య సామాన్యమైనవని మనందరికి తెలిసిందే. ముఖ్యంగా తెలంగాణ సమాజానికి, కేసీఆర్ గారికి ప్రణబ్ ముఖర్జీ గారితో ఉండేటటువంటి అనుబంధం తెలంగాణ సమాజం ఎల్లప్పుడు గుర్తు పెట్టుకుంటుంది. చిరస్మరణీయమైనది.

కారణం ఏమిటంటే, స్వాతంత్ర్యానంతరం ఈ దేశంలో జరిగిన అనేక రకాల ప్రజా అంశాలు, అభిప్రాయాల వెల్లడి కోసం అనేక ప్రాంతాలలో సాగించిన ప్రజాస్వామ్య ఉద్యమాలు కావచ్చు, ఆందోళనకరంగా సాగిన ఉద్యమాలు కావచ్చు, హింసాత్మకమైన ఘటనలు కావచ్చు. అస్సాం, డార్జిలింగ్‌లో ఆయన సొంత రాష్ట్రంలో మొదలు పెడితే జార్ఖండ్, తెలంగాణ ఇలా ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కో రకమైన ప్రజాభిప్రాయాలు వివిధ రూపాలలో వెల్లడవుతున్న సందర్భాలున్నాయి. ఈ దేశంలో పెల్లుబికిన అనేకానేక సాంఘిక, రాజకీయ ఉద్యమాలు, ప్రజా ఉద్యమాలన్నింటికీ వారు సాక్షి భూతం. ఈ అంశాలన్నింటిని అత్యంత చాకచక్యంగా పరిష్కరించడంలో అభిప్రాయాలకు ఉన్న ప్రజా పునాదులు ఏమిటి, వెల్లువెత్తుతున్న నిరసనలకు ఉన్న గరిమ ఏమిటి, ప్రాతిపదిక ఏమిటి అనే అంశాల గురించి కూలంకషంగా అధ్యయనం చేసి పరిష్కరిస్తేనే దేశ ప్రజాస్వామ్యం బలపడుతుంది తప్ప, అణచివేత ద్వారా కాదు అని బలంగా నమ్మిన వ్యక్తి ప్రణబ్ ముఖర్జీ గారు. వారు అపర మేధావి. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ గారి నాయకత్వాన మలి దశ ఉద్యమం ప్రారంభమైన తరువాత దేశ పార్లమెంట్ వ్యవస్థ యొక్క దృష్టిని ఆకర్షించి, ఆనాటి యుపిఏ ప్రభుత్వంలో కనీస ఉమ్మడి కార్యక్రమంలో చేర్చబడింది. తరువాత ఈ అంశం పరిష్కారం కోసం నియమింపబడిన కమిటీకి స్వయంగా ప్రణబ్ ముఖర్జీ గారే నేతృత్వం వహించారనేది మనందరం గుర్తుపెట్టుకోవాలి.

ఆనాడు యుపిఏ మొదటి ప్రభుత్వంలో కేసీఆర్ గారు కేంద్రమంత్రిగా ఉన్నారు. మంత్రివర్గం ఏర్పాటు జరిగినప్పుడు సంకీర్ణ ప్రభుత్వంలో నౌకాయాన శాఖను కేటాయిస్తే, ఇతర తమిళనాడు రాష్ట్రానికి సంబంధించిన ఆ పార్టీ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా మాకు కావాలని డిమాండ్ చేశారు. ఆ ప్రభుత్వానికి అసౌకర్యం కలుగకూడదు అని కేసీఆర్ గారు భావించి, మా ప్రాధాన్యత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తప్ప, పోర్ట్‌ఫోలియోనో, మంత్రి పదవో కాదని చెప్పి, ఒక ఐదు నిమిషాలు కూడా ఆలస్యం చేయకుండా ఆ శాఖను వారికి కేటాయించే విధంగా సహకరించిన ఘనత మా ముఖ్యమంత్రి గారికి దక్కుతుంది. ఆనాడు యుపిఏ ప్రభుత్వం ఇచ్చినటువంటి మాటను నిలబెట్టుకునే దిశగా, చేపట్టవలసిన చర్యలకు అనుగుణంగా ముఖ్యమంత్రి గారే స్వయంగా ఆనాడు ఉద్యమ నేతగా ఏ రకంగా సమస్యలను పరిష్కరించవచ్చో అని అనేక సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది.

తనకు ఉద్యమ సమయంలో వచ్చిన అనేక అనుభవాలను స్వయంగా కేసీఆర్ గారు ప్రణబ్ ముఖర్జీ గారితో పంచుకోవడం జరిగింది. ఆ సందర్భంలో కేసీఆర్ గారితో కలిసి వెళ్లడమనేది జీవితంలో మాకు కూడా మరచిపోలేనటువంటి అనుభూతిగా ఉంటుంది. ప్రణబ్ ముఖర్జీ గారితో మాట్లాడిన ప్రతిసారి ఒక నూతన ఉత్తేజంతో, కొండంత ఆత్మ విశ్వాసంతో కేసీఆర్ గారు బయటికి వచ్చే వారు. వారు ఇచ్చే స్ఫూర్తి అటువంటిది. ప్రణబ్ ముఖర్జీ గారు చెబుతూ ఉండేది, మీది న్యాయమైన కోరిక అని నాకు తెలుసు. కానీ, ఈ దేశంలో ఇది చాలా జఠిలమైన అంశంగా చిత్రీకరించబడింది. స్వర్గీయ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ గారితో అత్యంత సన్నిహితంగా ఉండే వాడిని, ఆనాడే పరిష్కారం కావలసిన అంశం అది. కాని కాల గమనంలో ఈ అంశాన్ని రాజకీయాలు జఠిలంగా మార్చాయి. చంద్రశేఖర్ గారూ, మీరు కాస్త నేర్పుగా ఉండండి, తప్పకుండా సమస్య పరిష్కారమవుతుంది, నమ్మండి అని చెబుతూ వచ్చే వారు. ఆ రకంగా జరిగిన అనేక చర్చల సందర్భంలో మేము వారితో పాటుగా ఉండి, ఇవన్నీ చూడటం జరిగింది. అంతిమంగా ప్రణబ్ ముఖర్జీ గారు రాష్ట్రపతిగా ఉండగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగడం, రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన బిల్లు మీద రాజముద్ర వారి చేతుల మీదుగా వేయడం ఇదంతా చరిత్రలో మనం చూసినటువంటిదే.

2014 ఫిబ్రవరి 18, 20 తారీఖులలో పార్లమెంటులో రెండు హౌజ్‌లలో బిల్లు పాస్ చేసిన తరువాత ప్రధానమంత్రి మరియు రాష్ట్రపతి గార్లకు ధన్యవాదాలు తెలిపేందుకు ప్రత్యక్షంగా అక్కడికి వెళ్లడం జరిగింది. మన ముఖ్యమంత్రిగారు ఆనాడు ఉద్యమనేతగా రాష్ట్రపతి భవన్‌లోకి వెళ్లినప్పుడు ఆ సందర్భంలో వారితోపాటు మేము కూడా ఉన్నాం. తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి భాగస్వాములైన వారందరూ నాతో పాటు ఉండండి, రాష్ట్రపతి గారికి మనం మనస్ఫూర్తిగా ధన్యవాదాలు అర్పించి రావాలని అంటే మేము అక్కడికి వెళ్లడం జరిగింది. వెయిటింగ్ హాల్లో రాష్ట్రపతి గారు వచ్చే ముందు వారిని కలుసుకోవడానికి నిర్దేశించిన స్థలంలో అందరం కూర్చొని ఉన్నాం. వారు రావడంతోనే గౌరవ ముఖ్యమంత్రి గారిని దగ్గరికి తీసుకుని ఆప్యాయంగా కౌగిలించుకుని వారి భాషలో ఇలా అన్నారు. "Chandrasekhar, you did it. A person achieving a goal during his lifetime is something great. That you have achieved." These are the words used by Sri Pranab Mukherjee garu.

11.20 ఉ. కేంద్ర క్యాబినేట్‌లో వారు ఆనాడు సీనియర్ మంత్రి, ఆ మంత్రివర్గంలో గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు మంత్రి, కేసీఆర్ గారు ప్రణబ్ ముఖర్జీ గారిని ఏనాడూ కూడా మంత్రిగా భావించలేదు, పితృ సమానులుగా భావించారు. అన్ని సందర్భాల్లో కూడా వారిని పితృ సమానులుగా భావించారు. వారు కూడా కేసీఆర్ గారిని ఆశీర్వదించుకుంటూ వచ్చారు. వారి ఆశీర్వాదం కేసీఆర్‌గారికి కొండంత బలాన్ని, ధైర్యాన్ని ఇచ్చింది. తెలంగాణ ప్రజలు ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకునేటటువంటి మహోన్నతమైన పర్సనాలిటి వారిది. వారు జీవితాన్ని మొదటిగా ఉపాధ్యాయులుగా, జర్నలిస్టుగా, సంపాదకుడిగా మొదలు పెట్టి, ఆ తరువాత రాజకీయ రంగంలో 1960వ సంవత్సరంలో అడుగుపెట్టి రాష్ట్రపతిగా గత నెల గతించే వరకు ఐదు దశాబ్దాలపాటు వారి నిర్విరామ సేవ భారత ప్రజాస్వామ్య వ్యవస్థను పరిపుష్టం చేశారని అనడంలో ఎటువంటి సందేహం లేదు. వారికి ఉన్న ప్రతిభాపాటవాలు అనన్య సామాన్యమైనవి. నేను వారి గురించి మాట్లాడే దక్షత, అర్హత ఉందని అనుకోవడం లేదు. కాకపోతే ఈ సభలో ఉన్నాను, గౌరవ ముఖ్యమంత్రిగారు నన్ను మంత్రిని చేశారు. తమరు మాట్లాడే అవకాశం ఇచ్చారు కాబట్టి, ఈ అవకాశాన్ని వినియోగించుకుని నాకు తెలిసిన రెండు విషయాలను చెబుతున్నాను.

గౌరవ ముఖ్యమంత్రిగారి గురించి వారి మాట్లాడిన విషయాలను వారే స్వయంగా రచించిన 'Coalition Years' పుస్తకంలో పేజి నెం.71లో వారు ప్రస్తావించారు. కేసీఆర్ గారు తెలంగాణ రాష్ట్రఏర్పాటు అంశాన్ని ఎంతో పట్టుదలతో

భారత రాజకీయ వ్యవస్థ మొత్తాన్ని ఏకం చేసి, పట్టువదలని విక్రమార్కుడిలాగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి అని వారు అన్నటువంటి మాటలు – In the context of TRS Party participation, KCR told me "Pranab Ji you know my ambition. I want a separate Telangana State. Whichever Portfolio you give me that is not important for me. Whatever Portfolio you give I will gladly accept it but for God's sake, please consider separate Telangana State." ఈ మాటలు కేసీఆర్ గారి యొక్క చిత్తశుద్ధిని, ఒక ఉద్యమ నాయకుడిగా ఆయనకు ఉండే స్ఫూర్తిని తెలియజేస్తాయని వారు ఉటంకించడం జరిగింది. అందుకే వారు అంశం యొక్క లోతుల్లోకి పోయి, పరిష్కారం చూపించడం కోసం వారు చూపిన శ్రద్ధకు వారికి ఉండే high intellectual caliber. అందుకే వారి గురించి అక్టోబర్ 31, 1984 నాడు శ్రీమతి ఇందిరాగాంధీ దారుణ హత్యకు గురైన తరువాత ఆ తదుపరి ప్రణబ్ ముఖర్జీగారు ప్రధాన మంత్రి అవుతారేమోనని రాజకీయ విశ్లేషకులు భావించారు. బిబిసీ వార్తా సంస్థ అయితే ఏకంగా భారతదేశానికి కాబోయే ప్రధాన మంత్రి ప్రణబ్ ముఖర్జీగారని ప్రకటించడం జరిగింది. కారణం ఏదైన కావచ్చు వారికి ఆ అవకాశం దక్కలేదు. కాని వారికి ఉండే క్యాలిబర్ ప్రస్ఫుటిస్తూ ఆ తదనంతరం జరిగే పరిణామాలు రాజీవ్ గాంధీగారి మంత్రి వర్గంలో వారు మంత్రిగా లేకపోవడం మొదలైన వాటిని ఉదహరిస్తూ ప్రితీష్ నంది అనే ప్రముఖ జర్నలిస్టు వారు 1986వ సంవత్సరంలో 12 పేజీలతో వ్యాసాన్ని రాశారు. ఆ వ్యాసంలో వారు ప్రణబ్ ముఖర్జీగారిని కోట్ చేస్తూ ఏమన్నారంటే, ఆ పరిస్థితిని ఉటంకిస్తూ 'A man who knew too much.' ఒక వ్యక్తి చాలా చాలా జ్ఞానవంతుడు, అతి జ్ఞానవంతుడు. బహుశా ఈ జ్ఞానమే వారికి శాపమైందేమో అనే కోణంలో మాట్లాడడం జరిగింది. అది వారికి ఉండేటటువంటి పరిణతి, మేధస్సు. అదే విధంగా ఇంకొక సెయింగ్ ఉంది 'The wonderful post of Prime Minister of India, which Pranab Ji never had" అని 'never could not become.' అని అంత దక్షత కల్గిన వారు. భారత రాష్ట్రపతిగా వారు సేవలు అందించి, మహనీయుడిగా భారతదేశం ఎల్లప్పుడు గుర్తు పెట్టుకునే అపర రాజకీయ చాణిక్యుడిగా వారికి సుస్థిరమైన స్థానం ఉంటుంది. అందువల్ల ఈరోజు సముచితంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి చేత ప్రతిపాదించబడిన ఈ సంతాప తీర్మానం ద్వారా వారికి వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేసే క్రమంలో నా వ్యక్తిగత సంతాపాన్ని ప్రభుత్వ పరంగా నా సంతాపాన్ని తెలియజేస్తూ, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని మనస్ఫూర్తిగా బలపరుస్తూ వారు ఇచ్చిన అవకాశానికి ధన్యవాదాలు. జై తెలంగాణ.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క (మధిర):- అధ్యక్షా, భారతజాతి ముద్దుబిడ్డ, భారతదేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడు మాజీ రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీగారు ఆగస్టు 31, 2020న పరమపదించడం భారతదేశానికి, అనేక పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ సమాజానికి కూడా చాలా పెద్ద ఎత్తున నష్టంగా నేను భావిస్తున్నాను. ప్రణబ్ ముఖర్జీ గారు పశ్చిమబెంగాల్‌లో జన్మించి, భారతదేశంలో ఉత్పన్నమైన అనేక సమస్యల్ని వారు మేధస్సుతో పరిష్కరించి ట్రబుల్ షూటర్‌గా పేరు ప్రఖ్యాతలు గావించిన మేధావి. ప్రణబ్ ముఖర్జీగారు న్యాయవాద వృత్తి చేపట్టి, ఒక ఉపాధ్యాయుడిగా, ఒక పాత్రికేయుడిగా ఆ తరువాత పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో స్వతంత్ర శాసనసభ్యుడిగా గెలుపొంది భారతరాజకీయాల్లో ప్రవేశించిన నాటి నుంచి వారు పరమపదించేంత వరకు కూడా భారతదేశ రాజకీయాల్లో ఆయన చెరగని ముద్రవేశారు. అతిచిన్న వయస్సులోనే భారతదేశ ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి, ఈ దేశంలో అనేక ఆర్థికమైన సంస్కరణలకు వారు పునాదులు వేశారు. దాదాపు ఐదు పర్యాయాలు ఎగువ సభకు ఎన్నికై, రెండు సార్లు లోక్‌సభకు ఎన్నికై వారి జీవితం మొత్తం ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పనిచేయడమే కాకుండా, ఆర్థిక మంత్రిగా కాని, వాణిజ్య మంత్రిగా కాని, ఎక్స్‌టర్నల్ అఫైర్స్, ఇంటర్నల్ అఫైర్స్ మంత్రిగా ఏ శాఖ వారు తీసుకున్నా కానీ ఆ శాఖకు వన్నె తీసుకురావడమే కాకుండా ఆ శాఖలో విధులు

నిర్వహించే వారందరికి ఒకగొప్ప మార్గదర్శకుడిగా ఈ దేశానికి వారు అందించిన సేవల్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవలసిన అవసరం ఉందని భావిస్తున్నాను. భారతదేశంలో ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి గాని, భారత ప్రభుత్వ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌కి దాదాపు 95 గ్రూపులకు ఆయన్ను ఛైర్మన్‌గా చేసి ఆ సమస్యల పరిష్కార మార్గాన్ని అడిగారంటేనే ఆయన మేధస్సుకి తప్పనిసరిగా ఇది ఒక కొలమానంగా మనమందరం భావించవచ్చు. అలాగే భారతరత్నగా దేశంలో ఉన్నటువంటి సమస్యలపై వారు వ్రాసిన పుస్తకాలు, వారు చూపిన మార్గం కూడా హర్షించదగినదిగా భావిస్తున్నాను. ఈ దేశం ఒక గొప్ప నాయకుడు చివరికి కరోనా బారినపడి మరణించడం చాలా బాధాకరమైన అంశం. గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడానికి ఆనాడు జరుగుతున్న పోరాటాల సందర్భంగా దేశంలో ఉన్న వారందరు కూడా వారి వైపు చూడడం, ఆయన మార్గదర్శిగా ఉండడం, వారు ఇచ్చే గైడెన్స్ కోసం ఎదురుచూడడం అనేది మనం అనేక రకాల సందర్భాల్లో చూశాము. నేను కూడా ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లు వచ్చినప్పుడు, దానికి సంబంధించి, తెలంగాణ రాష్ట్ర విభజనకు సంబంధించి అనేక సార్లు ఉప సభాపతిగా బిల్లును ప్రవేశ పెట్టే సందర్భంలో గానీ, వారు రాష్ట్రపతి విడిది చేయడానికి హైదరాబాద్ వచ్చినప్పుడు ప్రత్యేకంగా వారిని కలవడం, ఆ తరువాత ఒకటి రెండు సందర్భాల్లో ఢిల్లీలో కలిసి వారి దగ్గర నుంచి గైడెన్స్ తీసుకుని, విభజన బిల్లును ఏ విధంగా అమలు చేయాలనే అంశాన్ని వారి సూచనలతో చేయడం జరిగింది. నాకు కూడా వారితో ప్రత్యేకమైన అనుబంధం ఉంది.

11.30 ఉ. ప్రణబ్ ముఖర్జీ గారు ఈ దేశంలో పుట్టినందుకు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఎదిగి, కేంద్ర మంత్రిగా, రాష్ట్రపతిగా ఎదిగి ఈ దేశానికి ఎన్నో సేవలందించిన వారని చెప్పడానికి గర్విస్తూ, సభా నాయకుడు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు ప్రతిపాదించిన ఈ సంతాప తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను. ప్రణబ్ ముఖర్జీగారు చూపించిన బాటలో, ఎటువంటి డిస్టర్బెన్సెస్ లేనటువంటి సమాజ నిర్మాణం జరగాలని వారు ఏదైతే బలంగా కోరుకున్నారో అటువంటి సమాజ నిర్మాణం జరగాలని, ఆ విధంగా సమాజ నిర్మాణం జరిగే ప్రక్రియలో భాగంగా మనమందరమూ ఆ దిశలో అడుగులు వేస్తూ, నిజమైన నివాళులు ప్రణబ్ ముఖర్జీ గారికి అర్పించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఈటల రాజేందర్ (హుజూరాబాద్):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రివర్యులు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తున్నాను. 2004 ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమం ఎగిసిపడుతున్న సందర్భం. తెలంగాణ పల్లెల్లో ఏ మూల చూసినా, ఏ ఇంటిని కదలించినా, ఏ వ్యక్తిని కదలించినా జై తెలంగాణ నినాదం హోరెత్తుతున్న సందర్భం అది. యుపిఏ తమ భాగస్వామ్య పక్షాలను జమ చేసుకుంటున్న సందర్భంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే అందరినీ కూడగట్టుకున్నట్లే టిఆర్ఎస్ పార్టీతో జత కట్టాలనే ప్రతిపాదనతో ప్రణబ్ ముఖర్జీ గారు ముందుకు వచ్చినపుడు, గౌరవ ముఖ్యమంత్రి గారు ఆనాడు ఉద్యమ నాయకుడిగా, ఎన్నటికైనా మన తెలంగాణ రాష్ట్ర సాధన సమస్య ఢిల్లీలో పార్లమెంటులో పరిష్కారం కావలసి ఉంటుంది, జాతీయ పార్టీల మద్దతు లేకుండా ఇది సాధ్యం కాదు, మన ఆశయం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని భావించినందున, ఈ సమస్య సాధనలో భాగంగా మొత్తం మీద ఆనాడు టిఆర్ఎస్ పార్టీ వాళ్లతో జత కట్టింది. బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచాం. గౌరవ ముఖ్యమంత్రి గారికి ఒక అలవాటుంది, ఎప్పుడూ ఒక్కరే వెళ్లే వారు కాదు. పిల్లల కోడిలాగా అందరినీ తీసుకెళ్లేవారు. అందరమూ కలిసికట్టుగా పోయేవాళ్లం. గెలిచి ఢిల్లీకి వెళ్లాం. మేము ఢిల్లీలో మొట్టమొదటగా కలిసిన పెద్దాయన ప్రణబ్ ముఖర్జీ గారు. యుపిఏ పక్షాల సమావేశంలో కామన్ మినిమమ్ ప్రోగ్రాములో తెలంగాణ అంశాన్ని చేర్పించడంలో ఆనాటి ఉద్యమనేతగా కేసీఆర్ గారు

ఎన్ని ప్రయత్నాలు చేశారో మాకెరుక. మొత్తానికి కామన్ మినిమమ్ ప్రోగ్రాములో తెలంగాణ అంశం పెట్టబడింది. గౌరవ నిరంజన్‌రెడ్డి గారు చెప్పినట్లుగా, మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మేమందరమూ రాష్ట్రపతి భవనంలో స్వీట్లు పంచుకుంటున్నాం, స్వీట్లు పంచుకుంటున్న ఒక్కగంట లోపలే మాకు ఒక కబురు వచ్చింది. లేదు, లేదు, ఏ పోర్ట్‌ఫోలియోనైతే మీకు అలోకేట్ చేయబడిందో అది కాదు, మాకు వేరే ఇబ్బందులున్నాయంటూ మాకు అక్కడి నుంచి కబురు వస్తే, అప్పటికప్పుడు కేంద్ర మంత్రిగా ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా, మనకు కావలసింది తెలంగాణ పోర్ట్‌ఫోలియో, దానికన్నా షిప్పింగ్ పోర్ట్‌ఫోలియో, ఫైనాన్స్ పోర్ట్‌ఫోలియో పెద్దవి కాదు కదా, మనకు కావలసింది తెలంగాణ పోర్ట్‌ఫోలియో అని చెప్పి, ఒక్క నిమిషంలోనే వారికి సమ్మతి తెలిపి ఆనాటి యుపిఏ సర్కార్ కలిసికట్టుగా నడవడానికి దోహదం చేసిన టిఆర్ఎస్ పార్టీ నాయకుడు కేసీఆర్ గారు. అనేకసార్లు మేము వెళ్లి వాళ్లను కలిసేది. కామన్ మినిమమ్ ప్రోగ్రాములో పెట్టబడిన తెలంగాణ అంశాన్ని వాళ్లు అప్పుడప్పుడు మరచిపోతున్నా, డిలే అవుతున్నా ఇక్కడి నుంచి ఎన్ని విమర్శలు వచ్చేయో మీకు తెలుసు. బట్టలు తీసుకొనిపోయి వారాల తరబడి, నెలల తరబడి అక్కడే ఉండి, ప్రణబ్ ముఖర్జీ గారు ఏమి చెబుతారో, వారి నోటి నుండి ఏ సమాచారం వస్తుందోనని టీవీలకు అతుక్కొని చూసేది. దాదాపుగా 12, 14 గంటలు ఎదురుచూసిన సందర్భాలున్నాయి.

ఈ దేశంలో ఉండే అన్ని రాజకీయ పక్షాలు, ప్రభుత్వంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల నుండి ఆమోదం వచ్చింది కదా ఇంకా ఎందుకు తెలంగాణ విషయంలో డిలే అవుతోందని ప్రణబ్ ముఖర్జీ గారి నేతృత్వంలో ఏర్పడిన కమిటీని అడగడమే కాకుండా, ఆ కమిటీని బలోపేతం చేయడానికి , వారి చేతులకు కొంత శక్తిని ఇవ్వడానికి స్వయంగా కేసీఆర్ గారి నాయకత్వంలో ఈ దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల నాయకుల నుంచి తెలంగాణకు అనుకూలంగా సంతకాలు సేకరించి ఇవ్వడం జరిగింది. వారి మాటల్లో చెప్పాలంటే తొక్కని గడప లేదు, ఎక్కని మెట్టు లేదు. మాకు ఇంకొక పని ఉండేది కాదు. చాలా మంది అనేది, లేబర్ మినిస్టర్‌గా ఉన్నాడు, తెలంగాణ అంశాన్ని పట్టించుకోవడం లేదని అనేవారు. నేను లేబర్ మినిస్ట్రీకి పోను, ఇంకో దానికి పోను. నా ధ్యాస, నా యావ తెలంగాణ తప్ప మరొకటి లేదని చెప్పి ఆనాడు దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించి, మెప్పించి, వారిచేత సంతకాలతో కూడిన లెటర్స్ తీసుకొచ్చి ప్రణబ్ ముఖర్జీ గారి కమిటీకి ఇచ్చింది కేసీఆర్ గారు, టిఆర్ఎస్ పార్టీ. అంతే కాదు, ఈ దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల మేధావులకు, వైస్ ఛాన్సలర్స్‌కు , రాజకీయ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపిలకు తెలంగాణ ఎందుకు కావాలో తెలియజేస్తూ ఒక బుక్లెట్ రూపంలో ప్రింట్ చేసి ఇవ్వడమే కాకుండా, ఓహో! తెలంగాణ ఇంత అన్యాయానికి గురైందా అని అందరి చేత సానుభూతి, ఆమోదం పొందడానికి టిఆర్ఎస్ పార్టీయే కారణం.

అధ్యక్షా, మేము ఢిల్లీ ఎయిర్‌పోర్టులో దిగి కారు ఎక్కితే, కిదర్ జానా హై అని డ్రైవర్ అడిగినప్పుడు తుగ్లక్ రోడ్డు అని చెబితే, వెంటనే ఓహో తెలంగాణ కె లియే అని అనేవాడు. అంటే తెలంగాణ అంశం ఢిల్లీలో అంత ప్రాచుర్యం పొందింది. మొత్తానికి అప్పుడు కాకపోయినా తర్వాత సాధించడం జరిగింది. ప్రణబ్ ముఖర్జీ గారు విడిది కోసం రాష్ట్రపతిగా ఇక్కడికి వచ్చారు. ఆ సందర్భంగా వారు ఒక మాట అన్నారు. ఒక ఆశయాన్ని నమ్ముకొని, ఆ ఆశయాన్ని మొదలుపెట్టి, ఆ ఆశయంలో ప్రజలను చైతన్యపరచి, ఆ ఆశయాన్ని సాధించి, ఆ ప్రజల చేత మళ్లీ ప్రభుత్వంలోకి వచ్చి తెలంగాణ అభివృద్ధిలో పాలుపంచుకునే భాగ్యం మీకు మాత్రమే దక్కింది చంద్రశేఖర్ గారూ, మీ జీవితం ధన్యమైందని వారు చెప్పారు. నిజానికి ప్రణబ్ ముఖర్జీ గారి జీవితం కూడా ధన్యమైందని నేను భావిస్తున్నాను. ఎందుకంటే, కామన్ మినిమమ్ ప్రోగ్రాము పెట్టిన రోజు వారున్నారు, ఆ కమిటీకి ఛైర్మన్‌గా వారే ఉన్నారు. చివరికి రాష్ట్రపతి హోదాలో తెలంగాణ రాష్ట్ర బిల్లు మీద సంతకం చేసింది కూడా వారే. ఒక్క మాట చెప్పాలంటే, తెలంగాణ ఆశయ సాధనలో గౌరవ

ముఖ్యమంత్రి గారి జీవితం ఎలా ధన్యమైందో అలాగే అక్కడి నుంచి సంతకం పెట్టే వరకు ప్రణబ్ ముఖర్జీ గారి జీవితం కూడా ధన్యమైందని మేము భావిస్తున్నాం. అందుకే తెలంగాణ యావత్ ప్రజానీకం ఎల్లవేళలా ఆయన్ని గుండెల్లో పెట్టుకుంటుందని మనవి చేస్తున్నాను. వారు ఎప్పుడు బొల్లారం వచ్చినా అందరికీ ఫోన్ చేసే వారు. మేమంతా తప్పకుండా వెళ్లి కలిసే వాళ్లం. వారిని ఒక రాజకీయ నాయకుడిగా మేము చూడలేదు. కేసీఆర్ గారు – ప్రణబ్ ముఖర్జీ గారిని పితృ సమానులుగా చూశారు. ఎప్పుడు వెళ్లినా వారి ఆశీర్వాదం తీసుకునే వారు. తెలంగాణ రాష్ట్రసాధనలో ప్రణబ్ ముఖర్జీ గారి కృషి, ఆశీర్వాదం ఎప్పటికీ మరవలేము.

తెలంగాణ వస్తే బాగుపడుతుందా అనే సంశయాలు ఎన్నో ఉండేవి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశ చిత్రపటం మీద ఒక గొప్ప రాష్ట్రంగా ఆవిష్కరించడం తెలంగాణ ప్రభుత్వ బాధ్యతగా, కేసీఆర్ గారి బాధ్యతగా భావించి ఆ దిశగా మేము అడుగులు వేస్తున్నాం. ఇది సస్టెయినబుల్ రాష్ట్రం అవుతుందా అని ఇక్కడ చాలాసార్లు మాట్లాడారు. ఇది అయ్యేదా పోయేదా అని మాట్లాడారు. తెలంగాణ సస్టెయినబల్ రాష్ట్రంగానే కాకుండా, ఒక గొప్ప రాష్ట్రంగా ఎదగడంలో తప్పకుండా సఫలం అవుతామని ఆశిస్తున్నాం.

అధ్యక్షా, ప్రణబ్ ముఖర్జీ గారికి దగ్గర కావడానికి, వారిని ఒప్పించడానికి చేసిన ప్రయత్నాలకు సంబంధించి ఒక చిన్న సన్నివేశం చెబుతాను. జంగీపూర్ ప్రణబ్ ముఖర్జీ గారి లోక్ సభ నియోజకవర్గం, ఇది ముర్షీదాబాద్ జిల్లాలో ఉంది. కేసీఆర్ గారు లేబర్ మినిస్టర్‌గా ఉన్నపుడు వారిని తన నియోజకవర్గానికి తీసుకెళ్లారు. తన నియోజకవర్గంలో ఉన్న బీడీ కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలని ప్రణబ్ దాదా కోరితే, ఇంత పెద్ద మనిషి మీరు, మీరు అడిగితే నేను చేయకపోవడమా అంటూ ఇళ్లు మంజూరు చేశారు కేసీఆర్ గారు. వారితోబాటు జంగీపూర్ నియోజకవర్గం మొత్తం తిరిగి వచ్చిన తర్వాత, వెస్ట్ బెంగాల్ ఎంతో వెనకబడి ఉంది, ఇంత మంది గొప్ప నాయకులున్నా, ఇంత శక్తి ఉన్నా, ఇంత అధికారం ఉన్నా కనీస అభివృద్ధికి నోచుకోని ప్రాంతం అది, ఎప్పటికి బాగుపడుతుందోనని వెంటనే ఆ నియోజకవర్గంలోని ఆ బీడీ కార్మికుల కోసం పది, పన్నెండు వేల ఇళ్లు మంజూరు చేస్తే, ఇన్ని ఇళ్లు మంజూరు చేస్తారా, ఇన్ని ఇళ్లు కడతారా అని ప్రణబ్ ముఖర్జీగారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

11.40 ఉ. ఆ విధంగా ప్రణబ్ ముఖర్జీ గారితో మన గౌరవ ముఖ్యమంత్రి గారికి అనేక రకాల అనుభవం ఉన్నది. ఏది ఏమైనా వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భావిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎ.ఇంద్రకరణ్ రెడ్డి (నిర్మల్):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ ముందుగా సంతాప తీర్మానంపై మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గారి సంతాప తీర్మానంపై మాట్లాడే పరిస్థితి వస్తుందని ఏనాడూ ఊహించలేదు. ఆయన మరణం నాలాంటి ఎందరో రాజకీయ నాయకులకు, దేశ ప్రజలకు తీరని బాధను కలిగించింది. గొప్ప రాజనీతిజ్ఞుడైన ప్రణబ్ ముఖర్జీ గారి మృతితో దేశ రాజకీయాలలో ఒక శకం ముగిసింది. ఆయన దశాబ్దాల తరబడి అలుపెరగకుండా దేశ సేవ చేశారు. 21వ శతాబ్దంలో భారత్ సుసంపన్న దేశంగా ఎదిగేందుకు జరుగుతున్న కృషిలో ప్రణబ్‌దాదా వేసిన పునాదులు దేశం ఎన్నటికీ మరువబోదు. ఆయన లేని లోటు పూడ్చలేనిది. ప్రణబ్ ముఖర్జీ గారికి వినమ్ర శ్రద్ధాంజలి ఘటిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆ భగవంతుడు వారికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక ఉన్నతమైన పదవులను సమర్థవంతంగా చేపట్టి పేరు ప్రఖ్యాతులు గడించిన గొప్ప వ్యక్తి మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గారు. భారత 13వ రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన భారతరత్న ప్రణబ్ ముఖర్జీ గారు నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడిగా, ప్రజా సేవకుడిగా తనదైన ముద్ర వేశారు. 50 ఏళ్ల తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన

భారత ప్రజాస్వామిక వ్యవస్థపైన, రాజకీయ వ్యవస్థపైన చెరగని ముద్ర వేశారు. రాజకీయాలలో చాలా అరుదుగా కనిపించే వ్యక్తి, వారి మేధో సంపత్తి అమోఘం. నిరంతర అధ్యయనం చేసే వ్యక్తి, ఒక విద్యావేత్తగా, ఒక రచయితగా, ఒక మేధావిగా, ఒక ఉపన్యాసకుడిగా, ఒక ఆర్థిక వేత్తగా పేరు ప్రఖ్యాతులు గడించారు. ఇందిరా గాంధీ గారు, పి.వి. నరసింహారావుగారు, మన్మోహన్ సింగ్ గార్ల హయాంలో ప్రణబ్ ముఖర్జీ గారు కీలక పాత్ర పోషించారు. రాజకీయాలలో అరుదైన లక్షణాలతో అరుదైన గౌరవాన్ని పొందిన అరుదైన నాయకుడు ప్రణబ్ ముఖర్జీ గారని చెప్పవచ్చు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తిపై పూర్తి నమ్మకమున్న ప్రజాస్వామ్యవాది ప్రణబ్ ముఖర్జీ. ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ అత్యున్నత పదవిని అందుకోగలిగారు. 1935 డిసెంబరు 11న ఆనాటి బెంగాల్ ఇప్పటి పశ్చిమ బెంగాల్ మిరాఠీ గ్రామంలో ప్రణబ్ ముఖర్జీ గారు జన్మించారు. కలకత్తా యూనివర్సిటీలో చరిత్ర, పొలిటికల్ సైన్స్, న్యాయ శాస్త్రాలను అభ్యసించారు. 1969లో బెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఇందిరాగాంధీ గారి నాయకత్వంలో మొదట నౌక, రవాణా, పారిశ్రామిక మంత్రిత్వ శాఖలకు ఉపమంత్రిగా నియమితులై ఆ తరువాత 1982లో ఆయన 42 ఏళ్లకే ఆర్థికశాఖా మంత్రిగా నియమితులయ్యారు. దేశ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన ఆర్థిక మంత్రిగా గుర్తింపు పొందారు. 1991లో పి.వి.నరసింహారావు గారు ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రణబ్ ముఖర్జీ గారు ప్లానింగ్ కమిషన్ డెప్యూటీ ఛైర్మన్ అయ్యారు. 1993లో మళ్లీ కేంద్ర వాణిజ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1995లో విదేశీ వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. 2004 నుంచి 2006 వరకు రక్షణ శాఖ మంత్రిగా, 2006 నుంచి 2009 వరకు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా, 2009 నుచి 2012 వరకు ఆర్థిక శాఖ మంత్రిగా విధులు నిర్వహించడమే కాకుండా ఈ రంగాలలో ప్రధానమైన మార్పులు తెచ్చారు. ఆయన రక్షణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రక్షణ బడ్జెట్‌కు అంతకంటే ముందు కేటాయించిన నిధులకంటే ఎక్కువ పెంచగలిగారు. విదేశీ వ్యవహారాల మంత్రిగా భారత్, అమెరికా దేశాల మధ్య 2008లో అణు ఒప్పందం కుదుర్చడంలో కీలకమైన పాత్ర వహించారు. తేది.25.07.2012న దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ గారు ఎన్నికై 2017 జూలై, 25నరకు దేశ 13వ రాష్ట్రపతిగా ప్రణబ్ దాదా బాధ్యతలు నిర్వహించారు. ప్రణబ్ ముఖర్జీ విశిష్టసేవలకు గాను దేశంలో అత్యున్నత పురస్కారమైన భారతరత్నతోబాటు పద్మ విభూషణ్, ఉత్తమ పార్లమెంటేరియన్, బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ వంటి అవార్డులు అందుకున్నారు.

తెలంగాణ రాష్ట్రానికి, ప్రణబ్ ముఖర్జీ గారికి విడదీయరాని అనుబంధం ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రణబ్ ముఖర్జీ గారు కీలక పాత్ర పోషించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కామన్ మినిమం ప్రోగ్రాంలో తెలంగాణ అంశాన్ని చేర్చినప్పటి నుంచి అంటే 2004 నుంచి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వరకు ఆయనకు విడదీయరాని అనుబంధం ఉన్నది. రాష్ట్రపతిగా తెలంగాణ రాష్ట్రఏర్పాటు గెజిట్‌పై ప్రణబ్ ముఖర్జీ గారు ముద్ర వేయడం చారిత్రాత్మకమైన ఘటన. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు డిమాండు న్యాయమైనదని ప్రణబ్ ముఖర్జీ గారు భావించేవారని తనను కలిసిన ప్రతిసారి ఎన్నో విలువైన సూచనలు చేసేవారని కేసీఆర్ గారు పదేపదే గుర్తు చేస్తుంటారు. ఒక నాయకుడు ఉద్యమాన్ని ప్రారంభించి విజయతీరాలకు చేర్చే అవకాశం దక్కడం అరుదుగా సంభవిస్తుందని, ఆ ఘనత కేసీఆర్ గారికి దక్కిందని ప్రణబ్ ముఖర్జీగారు కేసీఆర్ గారిని ప్రత్యేకంగా అభినందించేవారని ఎన్నోసార్లు చెప్పడం జరిగింది. అనేక సందర్భాలలో ప్రణబ్ ముఖర్జీ గారు రాసిన పుస్తకంలో కూడా తెలంగాణ అంశాన్ని ప్రస్తావించారని, మన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ అంశమే తప్ప వేరే పోర్ట్ ఫోలియా అవసరం లేదని, కేసీఆర్ గారికి తెలంగాణ రాష్ట్రంపట్ల ఉన్న నిబద్ధతను ఆయన గుర్తు చేశారు. పది సంవత్సల కాలంలో తెలంగాణ అంశం పార్లమెంటులో గానీ జాతీయ రాజకీయాలలో గానీ రాజ్యాంగ

వేదికలలో గానీ ఎక్కడ ప్రస్తావనకు వచ్చినా దానికి అండగా నిలిచి తెలంగాణ రాష్ట్ర సాధన డిమాండును సమర్థించిన అగ్రనేత ప్రణబ్ దాదాకు తెలంగాణ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు. ప్రణబ్ ముఖ్యర్జీ గారితో నాకు కూడా ఎన్నో పర్సనల్ సంబంధాలుండేవి. 1991లో నేను ఎంపీగా ఉన్న సందర్భంలో ప్రణబ్ ముఖర్జీ గారితో నేను పార్లమెంటులో మొదటిసారి మాట్లాడటం జరిగింది. ఆ తరువాత అనేక సందర్భాలలో ఆయనను కలిసే అదృష్టం నాకు లభించింది. యూపీఏ హయాంలో చిన్న రాష్ట్రాల ఏర్పాటు కమిటీకి ప్రణబ్ దాదా నేతృత్వం వహించిన సందర్భంలో తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటివ్ ఫోరం సభ్యుడిగా గౌరవ రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు గారు, ఇతర నేతలతో ఆయన ఎన్నోసార్లు కలిసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలని కోరడం జరిగింది. 2015లో వారు రాష్ట్రపతిగా ఉన్నప్పుడు హైదరాబాదులో ప్రణబ్ ముఖర్జీ గారిని కలిసి సిర్‌పూర్ కాగజ్‌నగర్‌లో నివాసముంటున్న బెంగాలీ శరణార్థులకు గతంలో రద్దు చేసిన షెడ్యూల్డ్ క్యాస్ట్ సర్టిఫికేట్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న సందర్భంలో నేనొక దేవాదాయ శాఖ మంత్రిగా ఆయనకు స్వాగతం తెలపడం గౌరవంగా భావిస్తున్నాను. రాజకీయ జీవితంలో అనేక ఎత్తుపల్లాలను, ఎన్నో ఒడిదుడుకులను చూసిన ప్రణబ్ ముఖర్జీ గారు ప్రజాస్వామిక వాదిగానే జీవించారు. సిద్ధాంతాల మీద కాకుండా అవసరాలు, పదవుల ఆధారంగా రాజకీయాలు నడుస్తున్న నేటి కాలంలో సైద్ధాంతిక విధానాలకు నిలువెత్తు నిదర్శనంగా ప్రణబ్ ముఖర్జీగారు చరిత్రలో నిలిచిపోతారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ప్రణబ్ దాదా సేవలను కొనియాడడం ఆయన శిఖర సమాన రాజకీయ వ్యక్తిత్వానికి నిదర్శనమని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (మునుగోడు):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానం కీర్తిశేషులు భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గారి సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, అదే విధంగా నాకు మాట్లాడే అవకాశం కల్పించిన సభాపతి గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, ముఖ్యమంత్రి గారు ప్రణబ్ ముఖర్జీ గారి గురించి చెప్పిన ప్రతి మాటతో ఏకీభవిస్తూ నాకంటే ముందు మాట్లాడిన సభ్యులందరూ మాట్లాడుతూ ప్రణబ్ గారు ఒక మహోన్నతమైన వ్యక్తి అని చెప్పడమే కాకుండా వారు ఈ భారత దేశానికి అందించిన సేవలు గానీ ఆయన జీవితం గురించి గానీ వ్యక్తిత్వం గురించి గానీ తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో వారు పోషించిన పాత్ర విషయంలో గానీ ప్రతి మాటను నేను కూడా ఏకీభవిస్తున్నాను. 2009 నుంచి 2014 కాలంలో నేను ఎంపీగా ఉన్న సందర్భంలో మన ముఖ్యమంత్రి కేసీఆర్ గారు కూడా ఆ సభలో సభ్యులుగా ఉన్న సందర్భంలో ఆరోజు ప్రణబ్ ముఖర్జీ గారితోపాటు నేను కూడా ఉండటం జరిగింది. ఎందుకంటే ఆయన ఒక సీనియర్ నాయకుడు ఒక పార్టీకి సంబంధించిన వ్యక్తి కాదు, దేశం కోసం అహర్నిశలు ఆలోచించే వ్యక్తిగా నేను అతనిని చాలా దగ్గర నుంచి చూడటం జరిగింది.

11.50 ఉ. పార్టీలు వేరైనా ఆనాడు తెలంగాణ ఉద్యమం జరుగుతున్న సందర్భం కాబట్టి, 2009 నుండి 2014 మధ్య కాలంలో ఎన్నో సందర్భాల్లో అప్పటి ముఖ్యమంత్రి గారితో గానీ, కాంగ్రెస్ పార్టీ సహచర సభ్యులతో గానీ కలిసి తెలంగాణ అంశాన్ని ప్రణబ్ ముఖర్జీ గారి వద్దకు ఎప్పుడు తీసుకువెళ్లినా సరే, ఆయన అది జటిలమైన సమస్య అని చెబుతూనే, అటుప్రక్క ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ సభ్యులు చేస్తున్న గొడవను ప్రస్తావిస్తూనే ఒకవైపు Leader of the Houseగా పార్లమెంట్‌ను నడిపించుకుంటూ, ఇటు భారతీయ జనతా పార్టీ వారి సహకారం తీసుకుంటూ, ప్రతి బిల్లును గట్టెక్కించుకొంటూ, అదే సమయంలో తెలంగాణ ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమం, బలిదానాల విషయాలన్నింటినీ ఎప్పటికప్పుడు మాద్వారా తెలుసుకుంటూ ఉండేవారు.

నిజంగా కూడా ఒక గొప్ప వ్యక్తి, ఒక తండ్రిలాంటి వ్యక్తి ఆయన. పార్లమెంట్ సమావేశాల్లో కొన్నిసార్లు నిరసన వ్యక్తం చేసి, కొన్ని ముఖ్యమైన బిల్స్ చర్చించినప్పుడు వాటికి అడ్డుతగులుతున్న సందర్భంలో తండ్రిలాగా వారు మమ్మల్ని మందలించేవారు. కానీ, ఒక గొప్ప విషయం ఏమిటంటే – వారు మమ్మల్ని ఏరోజు మందలించినా మేము బాధపడేవారము కాదు. మళ్లీ రాత్రి పదకొండు, పన్నెండు గంటలకైనా మమ్మల్ని ఇంటికి పిలిపించుకొని మీరు దయచేసి అర్థం చేసుకోండి, మీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం చాలా ముఖ్యమైన అంశం. గతంలో కాంగ్రెస్ పార్టీ మీకు మాట ఇచ్చింది, డిసెంబర్ 9న ప్రకటన కూడా వచ్చింది. తప్పకుండా మీ రాష్ట్ర అవతరణ కల నెరవేరుతుంది, అప్పటివరకు మీరు ఓపికతో వేచి చూడండి అని చాలా సందర్భాల్లో చెప్పేవారు. ప్రణబ్ ముఖర్జీ గారిని రాష్ట్ర ప్రజలే కాదు, దేశ ప్రజలందరు కూడా ఒక పార్టీ నాయకుడిగా కాకుండా ఒక భారత రాష్ట్రపతిగా అందించిన సేవలన్నీ కూడా గుర్తుపెట్టుకొంటూ యావత్ జాతి ఒక మహోన్నతమైన వ్యక్తిని కోల్పోయిందని తెలియజేసుకుంటున్నాను. మనందరం కూడా ఆయన చేసిన సేవలను గుర్తుపెట్టుకోవాలని కోరుతూ, ముఖ్యంగా గౌరవ ముఖ్యమంత్రి గారు చాలా సందర్భాల్లో చెబుతుండేడివారు పదవి ముఖ్యం కాదు – మనకు రాష్ట్రం ముఖ్యమని చెప్పడం, నిజంగా మనందరం ఆయనను అభినందించదగ్గ విషయం. ఎందుకంటే, పదవులకంటే ఎక్కువగా రాష్ట్ర అవతరణ ముఖ్యమన్న విషయాన్ని ఎన్నో సందర్భాల్లో ముఖ్యమంత్రి గారు నిరూపించుకున్నారు. కాబట్టి, ఆయనకు కూడా ఈ సభ ద్వారా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. చివరిగా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, మాజీ రాష్ట్రపతి కుటుంబానికి ప్రగాఢ, సానుభూతిని, వారి మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ నివాళులు అర్పిస్తున్నాను.

శ్రీ జి. జగదీష్‌రెడ్డి (సూర్యాపేట):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, వారి గురించి గౌరవ సభ్యులు మరియు గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా వ్యక్తీకరించినారు. వారి గుణగణాల, శక్తి సామర్థ్యాల గురించి ఇంకా పరిచయం చేసుకునే అక్కర లేదనే విషయం మనందరికీ తెలుసు. ఎందుకంటే, కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి పెద్ద సమస్య వచ్చినా అటువంటి ఏ అంశాన్ని అయినా వారికే అప్పగించిన విషయాన్ని మనం ఎన్నో సందర్భాల్లో గమనించాం. కొంత ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ, ఎందుకో తెలంగాణ ఉద్యమానికి సంబంధించి మొదటినుండి కూడా వారికే అవినాభావ సంబంధం ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా తెలంగాణ సమస్య వచ్చినప్పుడు వారికే అప్పగించారు. ఆ తరువాత ఉద్యమ సందర్భం వచ్చినప్పుడు, తెలంగాణ అంశాన్ని యు.పి.ఏ.లో చేర్చడానికి సంబంధించిన చర్చ వచ్చినప్పుడు కూడా దానిని వారికే అప్పగించారు. తాను కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ కోర్ కమిటీ ఛైర్మన్‌గా కూడా వారికే అవకాశం వచ్చింది.

చివరికి వారే ఈ దేశ అధ్యక్షులుగా తెలంగాణ బిల్లుపైన సంతకం పెట్టిన విషయం మనందరికీ తెలుసు. గౌరవ ముఖ్యమంత్రి గారు ఆనాటి ఉద్యమ నాయకుడిగా ఎప్పుడు ఢిల్లీకి వెళ్లినా, ఎప్పుడు ప్రణబ్ ముఖర్జీ గారి వద్దకు వెళ్లినా తనతో పాటు మేము కూడా వారిని కలిసి వచ్చేవారం. వచ్చిన తరువాత కేసీఆర్ గారు నెమ్మదిగా వచ్చేవారు గానీ, బయట చుట్టూ ఉన్న వారిమి, మేమంతా మాత్రం కొంత కోపంగా ఉండే వారిమి. ఏదో సందర్భంలో మేము కేసీఆర్ గారి వద్ద వ్యక్తీకరించే వాళ్లం. అప్పుడు వారు మాకు చెప్పేది, మీరంతా యువకులు చాలా నేర్చుకోవాలి, వారి నుండి నేర్చుకోవాల్సింది చాలా ఉంటుంది. ఒక పెద్ద లక్ష్యాన్ని సాధించేటప్పుడు ఓపిక అవసరం అని చెప్పేది. ఆయనకు ఎంత అనుభవం ఉంటే వారికి ఇటువంటి విషయాలు అప్పజెబుతున్నారు. ఎప్పుడు నిర్ణయం జరిగినా వారి పాత్ర తప్పకుండా ఉంటుందనే విషయాన్ని గుర్తు పెట్టుకొని మెలగాలనే విషయాన్ని, తనకు వ్యక్తిగతంగా ఎదురైన అనుభవాలు కూడా గౌరవ ముఖ్యమంత్రికేసీఆర్ గారు ప్రతి సందర్భంలో కూడా మాకు చెబుతుండేడివారు. అటువంటి విషయాలు వారి గురించి ఎన్నో నేర్చుకున్న సందర్భాలున్నాయి.

వ్యక్తిగతంగా నా జీవితంలో ప్రణబ్ ముఖర్జీ గారితో నాకు ఒక అనుభవం ఉంది. యు.పి.ఏ. ప్రభుత్వం వేసిన కమిటీలో వారు అధ్యక్షులుగా ఉండి వారు మన రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు వారికి వ్యతిరేకంగా తెలిపిన నిరసన కార్యక్రమాల్లో నేను జైలుకు వెళ్లాల్సి వచ్చింది, 15 రోజులు జైలులో ఉన్నాను. కానీ, విచిత్రంగా నేను రాష్ట్రమంత్రిగా వారి పర్యటనను స్వాగతిస్తూ వారికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తూ వారిని స్వాగతించే అదృష్టం కూడా నాకు వచ్చింది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుపై సంతకం చేసిన తరువాత వారికి ధన్యవాదాలు తెలిపి వద్దామనే టీంలో గౌరవ ముఖ్యమంత్రి గారితో నేను కూడా ఉన్నాను. గౌరవ రాష్ట్రపతి గారి ప్రోటోకాల్ ఎలా ఉంటుందో మనందరికీ తెలిసిన విషయమే. ప్రోటోకాల్ నిబంధనలను ప్రక్కకు పెట్టి వారుకేసీఆర్ గారిని చూడగానే దగ్గరకు వచ్చి కౌగిలించుకొని చంద్రశేఖర్ నీవు ధన్యుడవు, నీవు సాధించావు. నేను ప్రపంచ చరిత్రలను చాలా చూశాను, ఇలా ఒక లక్ష్యాన్ని ఉద్దేశించి ప్రారంభించబడిన ఉద్యమాలు ప్రపంచ చరిత్రలో విజయవంతం అయినవి చాలా తక్కువ. విజయవంతం అయినవి కూడా ప్రారంభించిన నాయకుడితో ఏవీ ముగింపు కాలేదు. కానీ, నీవే ప్రారంభించి నీవే ముగింపు చేసి సాధించిన ఉద్యమం ప్రపంచం మొత్తంలో అతికొద్ది మందిలో నీవు ఒకడివని చెప్పి వారు అన్న మాటలు నాకు ఎప్పుడు ప్రత్యక్షంగా గుర్తు ఉంటాయి.

ఈ సభ ద్వారా కాకుండా, వ్యక్తిగతంగా కూడా ఎన్నో చోట్ల కొన్ని వందల సందర్భాల్లో నేను ఈ విషయాన్ని ప్రస్తావించి ఉంటాను. అంటే తాను అంత గొప్ప మనిషి ఆయన. వారు మనకంటే ఎన్నో విషయాలను చరిత్రలో చూసిన వారు. ఇంతకు ముందు గౌరవ సహచర మంత్రివర్యులు చెప్పినట్లు, వారికి ఉండే నాలెడ్జే వారికుండే గొప్పతనం. వారికి ఒక దశలో అదే శాపంగా పరిణమించిందనే గొప్ప వ్యక్తి, వారు మా నాయకుడి గురించి అట్లా మాట్లాడుతుంటే మేము చాలా గర్వపడ్డాం.

ఇప్పుడు నేను అనుకుంటా, వారి కుటుంబంతోపాటు మా నాయకుడుకేసీఆర్ గారికి కూడా వ్యక్తిగతంగా కొంత లోటేమో అని అనుకుంటాను. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రం ఏ లక్ష్యాల కొరకైతే సాధించామో, ఇవాళ ఆ లక్ష్యాలు చేరుకుంటున్నాం, దాదాపుగా చేరువైనాం. పేదరిక నిర్మూలన ఏ పద్ధతి ప్రకారం జరుగాలో, అభివృద్ధికి ఒక నమూనా లాగా తెలంగాణ రాష్ట్రం అవతరిస్తున్న ఈ సందర్భంలో ఈ దేశంలో కూడా ఒక గుణాత్మకమైన మార్పు రావాలని స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలు నెరవేర్చడంలో ఇంకా ముందడుగు వేయవలసిన అవసరం ఉందని, ఈ సందర్భంలో కొత్తగా ఆలోచనలు చేయవలసిన అవసరం ఉందని భావిస్తున్న కొంతమందిలో మా నాయకుడుకేసీఆర్ కూడా అనేక సందర్భాల్లో అనేక భావనలు వ్యక్తీకరిస్తున్నారు. ఇటువంటి సందర్భంలో వారు గనుక ఉండి ఉంటే తప్పకుండా మా నాయకుడుకేసీఆర్ గారి భావాలతోని ఏకీభవించేవారని, వారి ఆశీస్సులు ఇచ్చేవారని, సూచనలు చేసేవారని మేము భావిస్తున్నాం.

అంతటి మహనీయుడు, వారి 50 సంవత్సరాల అనుభవాన్ని తప్పకుండా మాకు కూడా ఇచ్చి ముందుకు నడిపించేవారని,కేసీఆర్ గారిని ఇంకా ముందుకు నడిపేందుకు వారి సలహాలు, సూచనలు ఉపయోగపడేవని భావిస్తూ, వారి లేని లోటు తీర్చలేనిదని, ఈ సందర్భంగా వారి మృతికి సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని మనస్ఫూర్తిగా బలపరుస్తున్నాను.

12.00 మ. **శ్రీ బాల్క సుమన్ (చెన్నూరు):** అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన భారత మాజీ రాష్ట్రపతి స్వర్గీయ శ్రీ ప్రణబ్ ముఖర్జీగారి సంతాప తీర్మానాన్ని నేను బలపరస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చిన తమరికి ముందుగా నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఇంతకుముందు మాట్లాడిన సీనియర్ సభ్యులు మరియు మంత్రివర్యులు చాలా విషయాల గురించి చెప్పారు. నేను వాటిని రిపీట్ చేయకుండా నా అనుభవంలో ఉన్న మరికొన్ని

విషయాల గురించి ఇక్కడ ప్రస్తావిస్తాను. బెంగాల్ నుండి మనకు ఎంతోమంది గొప్ప వ్యక్తులు లభించారు. సుభాష్‌చంద్రబోస్, బంకించంద్ర చటర్జీ మరియు రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి విశిష్టమైన వ్యక్తుల కోవలో, ప్రణబ్‌ముఖర్జీగారు కూడా ఒకరుగా ఉంటారని నేను భావిస్తున్నాను. ఎందుకంటే, ఇందిరాగాంధీగారి నుండి మొదలుకొని, మూడు తరాల వారితో, దాదాపు 50 సంవత్సరాలకు పైగా వారు కలిసి పనిచేశారు. వారికున్న అపారమైన మేధో సంపత్తి, జ్ఞాన సంపద, విశేషమైనటువంటి అనుభవం అందరికీ తెలిసిందే. నేను గతంలో పార్లమెంటు సభ్యునిగా ఉన్నందువలన నాకు కూడా తెలుసు. ఇందాక భట్టిగారు చెప్పినట్లుగా 2004 నుండి 2012వ సంవత్సరం వరకు దాదాపు 95 గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌కు సారథ్యం వహించారు. ఇందిరాగాంధీగారి హయాంలో రక్షణశాఖ మంత్రిగా భారతదేశానికి తమ సేవలను అందించారు. అదే విధంగా విదేశాంగ మంత్రిగా, ఆర్థిక శాఖ మంత్రిగా కూడా వారు వేసిన ముద్ర చాలా సుస్పష్టం.

వారు ఒక మామూలు అప్పర్ డివిజన్ క్లర్కుగా తమ జీవిత ప్రస్థానాన్ని ప్రారంభించి, తరువాత అసిస్టెంటు ప్రొఫెసర్‌గా, జర్నలిస్టుగా పనిచేసి, చివరకు భారతదేశ అత్యున్నత పదవి అయిన 13వ రాష్ట్రపతిగా సేవలను అందించి, ఈ దేశ రాజకీయాల మీద చెరగని ముద్ర వేశారనడంలో అతిశయోక్తి లేదు. ఇంతకు ముందు చాలామంది పెద్దలు చెప్పినట్లుగా ప్రణబ్ ముఖర్జీగారికి తెలంగాణ రాష్ట్రానికి అవినాభావ సంబంధం ఉందనే విషయంలో నేను కూడా పూర్తిగా ఏకీభవిస్తున్నాను. గతంలో కామన్ మినిమం ప్రోగ్రాం తయారుచేయడంలోగాని, యూపిఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు వేసిన కమిటీకి నేతృత్వం వహించడంలోగాని తదనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాష్ట్రపతిగా ఆమోద ముద్ర వేయడంగాని చూసినట్లయితే తెలంగాణ రాష్ట్రంతో వారికి ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుంది.

పార్లమెంటు సభ్యునిగా నా అనుభవం ఏమిటంటే మేము కేంద్ర ప్రభుత్వ వైఖరి పట్ల టిఆర్ఎస్ పార్టీ పక్షాన పోరాటం చేసేవాళ్లం. ఖమ్మం జిల్లానుండి 7 మండలాలు ఏపికి బదలాయించిన విషయంలోగాని, లేదా హైకోర్టు విభజన విషయంలోగాని, తెలంగాణకు రావలసిన నిధుల విషయంలోగాని లేదా తెలంగాణకు జరుగుతున్న విషయంలోగాని మేము టిఆర్ఎస్ పార్టీ తరఫున లోక్‌సభలో నిరసన వ్యక్తం చేశాము. ఆ పిమ్మట ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు, కేశవరావుగారి నేతృత్వంలో మా ఎంపిల బృందం వెళ్లి, ప్రణబ్‌ముఖర్జీగారిని కలవడం జరిగింది. మేము వారిని కలవగానే, మొదటగా వారు అడిగిన ప్రశ్న how is Chandrasekhar? కేసీఆర్‌గారిని వారు చంద్రశేఖర్ అనేవారు. సారు బాగానే ఉన్నారని చెప్పి, మేము మాట్లాడేవాళ్లం. మా సమస్య గురించి చెబితే వారు మాతో చెప్పేవారు– I know that Chandrasekhar did so much hard work for Telangana. అని అంటూనే, మేము చెప్పిన సమస్యలను విని, మా వంతు సహాయం తప్పకుండా చేస్తామని మమ్మల్ని కొంత ఓదార్చి, పంపేవారు.

ఇందాక పెద్దలు నిరంజన్ రెడ్డిగారు చాలా గొప్ప అంశం చెప్పారు. ఒక నాయకుడి చిత్తశుద్ధికి అది మచ్చుతునక. సభ్యులుగా మా నాయకుడి గురించి మేము చెప్పుకోవడం కాదల. అంత పెద్ద మేధావి, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నటువంటి వ్యక్తి, వారు స్వయంగా రాసిన కొయిలీషన్ ఇయర్స్ అనే పుస్తకంలో కేసీఆర్‌గారు తనకు పోర్ట్‌ఫోలియో కంటే, తెలంగాణ రాష్ట్రమే ముఖ్యము అని కేసీఆర్‌గారు చెప్పిన విషయాన్ని ప్రణబ్ ముఖర్జీగారు అందులో ప్రస్తుతించడం, కేసీఆర్‌గారి చిత్తశుద్ధిని వారే ప్రపంచానికి చాటిచెప్పినట్లుగా మేము భావిస్తున్నాము. అలాగే జగదీష్‌రెడ్డిగారు చెప్పినట్లుగా ఈ దేశంలో గుణాత్మకమైన మార్పు రావాలని కోరుకుంటున్న కొద్దిమందిలో మా నాయకులు ఒకరు అధ్యక్షా. ఈ తరుణంలో ప్రణబ్ ముఖర్జీలాంటి గొప్ప వ్యక్తి, కేసీఆర్‌గారితో మంచి అనుబంధం ఉన్న వ్యక్తి మనకు దూరం కావడం మా

నాయకుడిగి కొంచెం లోటుగా మేము భావిస్తూ, కచ్చితంగా వారి సేవలు ఈ భారత జాతి గుర్తు పెట్టుకుంటుందని భావిస్తూ, వారి ఆలోచనల మేరకు, వారి కోరిక మేరకు ప్రజాస్వామ్య విలువల ప్రకారం చర్చలు జరగాలి, వాదోపవాదాలు ఉండాలి, అంతిమంగా మంచి నిర్ణయాలు తీసుకోవాలని బెస్ట్ పార్లమెంటేరియన్‌గా వారు ఏదైతే కాంక్షించారో అది ఫలించాలని కోరుకుంటున్నాను. మరొక విషయం మనవి చేసుకుంటున్నాను. వారు ఎనిమిది సంవత్సరాలపాటు, నాన్-ప్రైమ్‌మినిస్టర్ లోక్‌సభ నాయకుడిగా ఉండటం అనేది భారతదేశ రికార్డు. ఆ బాధ్యతను కూడా వారు సమర్థవంతంగా నిర్వహించారు. అలాగే సంకీర్ణాల శకంలో కూడా ఇతర మిత్రపక్షాలతో మంచి సయోధ్యను పార్టీకి అందించారు. దేశం ఏ రకంగా ముందుకు వెళ్లాలో ఒక దార్శనికుడిగా వారి వ్యవహార శైలిని మేము అనుభవంలో చూశాం. ఆ విధంగా తెలంగాణ రాష్ట్రం కేసీఆర్‌గారి నాయకత్వంలో, సమున్నతమైన భావనతో, గొప్ప ప్రజాస్వామ్య స్ఫూర్తితో ముందుకు పోయి, వారికి నిజమైన నివాళులు అర్పించే ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తూ, వారు ఎక్కడున్నా వారి ఆశీస్సులు మా ముఖ్యమంత్రిగారికి, తెలంగాణ రాష్ట్రానికి ఉంటాయని భావిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని మనస్ఫూర్తిగా బలపరుస్తున్నాను.

శ్రీ డి. సుధీర్ రెడ్డి (ఎల్బీనగర్):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రతిపాదించిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చిన తమకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ప్రణబ్ ముఖర్జీగారి మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయింది. భారతరత్న స్వర్గీయ ప్రణబ్ ముఖర్జీగారు 1935లో మిరాఠి అనే గ్రామంలో జన్మించారు. వారు ఒక చెరువు దాటి వెళ్లి, తమ విద్యాభ్యాసం పూర్తిచేశారు. యుడిసిగా తమ జీవితాన్ని ప్రారంభించి, న్యాయవాదిగా వృత్తిని కొనసాగించి, పిమ్మట రాజకీయ ప్రవేశం చేశారు. 1969లో రాజకీయ రంగ ప్రవేశం చేసి, ఐదు సార్లు రాజ్యసభ సభ్యునిగా, 2004 నుండి 2012 వరకు ఎనిమిది సంవత్సరాలపాటు లోక్‌సభ సభ్యునిగా, దాదాపు 38 సంవత్సరాలపాటు ఉభయ సభలతో వారికి అనుబంధం ఉంది. అనేక జటిల రాజకీయ సమస్యలను వారు తమదైన శైలిలో పరిష్కరించారు. దేశంలో ఎన్నో రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ, అన్ని పార్టీలకు, అందరు నాయకులకు ఒక ఆమోదమైన వ్యక్తిగా పేరు గడించారు. ప్రణబ్ ముఖర్జీగారు ఉంటే మా సమస్యలు పరిష్కారమవుతాయి, మాకు న్యాయం జరుగుతుందనే ఒక మంచి పేరు తెచ్చుకున్నారు. అలాంటి ఒక నమ్మకాన్ని ఇరు వర్గాలలో వారు సృష్టించుకున్నారు. అలాగే 2004 నుండి 2012 వరకు అనేక పదవులు సమర్థవంతంగా నిర్వర్తించారు. వాణిజ్యం, విదేశ వ్యవహారాలు, ఆర్థిక మంత్రిత్వశాఖ, రక్షణ శాఖ, షిప్పింగ్ శాఖలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. పి.వి. నరసింహారావు గారు ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో వారి విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం జరిగింది. థాయ్‌లాండ్, సింగపూర్ వంటి దేశాలతో మైత్రీ బంధం ఏర్పాటు చేశారు. వారు 96 లోక్‌సభ కమిటీలకు అధ్యక్షత వహించారు. దేశ చరిత్రలోనే ఇదొక రికార్డు. ప్రపంచ రికార్డు కూడా నేమోనని ఒకసారి కేంద్ర ప్రభుత్వం పరిశీలించవలసి ఉంది. ఇన్ని కమిటీలకు అధ్యక్షుడిగా ఉంటూ, తనదైన శైలిలో ఒక ముద్రను వేసి, ఎన్నో సమస్యలను వారు పరిష్కరించడం జరిగింది. వారు ఎప్పుడూ విలువలను కాపాడుకుంటూ వచ్చారు. ఉప్పు లేనిదే కూర రుచిగా ఉండదు అని ఒక సామెత ఉంది. ఉప్పు లేనప్పుడు దాని విలువ ఏమిటో తెలుస్తుంది. ఆ ఉప్పు లాంటి పాత్ర ప్రణబ్ ముఖర్జీగారు పోషించారు. ఆయన లేని లోటు ఎప్పటికీ తీరదు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేసుకుంటూ, ఆయన బాటలో నడిచే ప్రయత్నం చేస్తామని మనవి చేసుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

12.10 మ. **మిస్టర్ స్పీకర్**:- భారతదేశ మాజీ రాష్ట్రపతి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని తెలియపరుస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ప్రణబ్ ముఖర్జీ గారు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని బీర్‌బమ్ జిల్లాలోని మిరాతి గ్రామంలో రాజ్యలక్ష్మి ముఖర్జీ, కింకర్ ముఖోపాధ్యాయ్ సరని దంపతులకు 1935వ సంవత్సరం డిసెంబర్ 11వ తేదీన జన్మించారు. వీరు కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఏ చరిత్ర, రాజనీతి శాస్త్రం, ఎల్‌ఎల్‌బి పట్టా పొందారు. వీరు అప్పర్ డివిజన్ క్లర్క్‌గా, న్యాయవాదిగా, రాజనీతి శాస్త్ర అధ్యాపకునిగా, జర్నలిస్ట్‌గా పని చేశారు. వీరు 1969, 1975, 1981, 1993, 1999 సంవత్సరాల్లో ఐదు పర్యాయములు రాజ్యసభకు, 2004 మరియు 2009 సంవత్సరాల్లో రెండు పర్యాయములు లోక్‌సభకు ఎన్నికయ్యారు. వీరు శ్రీమతి ఇందిరాగాంధీ ప్రభుత్వంలో పరిశ్రమలు, షిప్పింగ్, రవాణ, రెవెన్యూ, బ్యాంకింగ్ శాఖల సహాయ మంత్రి, వాణిజ్యం, ఉక్కు, గనులు, ఆర్థిక శాఖల మంత్రిగా పని చేశారు. పి.వి.నర్సింహారావు గారి మంత్రివర్గంలో వాణిజ్యం, విదేశీ వ్యవహారాల మంత్రిగా పని చేశారు. మన్‌మోహన్‌సింగ్ గారి ప్రభుత్వంలో రక్షణ, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక శాఖ మంత్రిగా పని చేశారు. 1991 సంవత్సరం నుండి 1996 సంవత్సరం వరకు ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షులుగా పని చేశారు. దేశంలోని ఆర్థిక సరళీకరణకు, తరువాత ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసి ఏడు పర్యాయములు కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టారు. 1980 సంవత్సరం నుండి 1985 సంవత్సరం వరకు రాజ్యసభలోను, 2004 నుండి 2012 వరకు లోక్‌సభలోను పని చేశారు. 2012 నుండి 2017 వరకు భారతదేశ 13వ రాష్ట్రపతిగా పని చేశారు. 1984 సంవత్సరంలో ప్రపంచ ఉత్తమ ఆర్థిక మంత్రులుగా ఎంపిక కాబడ్డ ఐదుగురిలో ఒకరిగా 1997 సంవత్సరంలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, 2008 సంవత్సరంలో పద్మవిభూషణ్, 2010 సంవత్సరంలో ఆసియాలో ఉత్తమ ఆర్థిక మంత్రిగా 2011 సంవత్సరంలో ఉత్తమ పరిపాలనాదక్షుడిగా అవార్డులను గైకొన్నారు. వీరు భారతదేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను 2019 సంవత్సరంలో అందుకున్నారు. అత్యున్నత ప్రతిభ, అపారమైన రాజకీయ అనుభవం సంక్లిష్ట పరిస్థితుల్లో, సంక్షోభ పరిష్కర్తగా పేరు గడించిన ప్రణబ్‌ముఖర్జీ గారు Mid-Term Polls, Challenges before the Nation, Thoughts and Reflections, Turbulent Years, Coalition Years, పలు గ్రంథాలు రాశారు. వారి ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో అనేక ఉన్నత పదవులను ఎంతో బాధ్యతగా, సమర్థవంతంగా నిర్వహించారు. వీరు పార్టీలకు అతీతంగా అందరి మన్ననలను చూరగొన్నారు. నాలుగు తరాల నాయకులకు మార్గదర్శిగా నిలిచారు. ఎంతటి పని భారాన్నయినా మోయగలిన మేధాశక్తి కలిగిన వారు. రాష్ట్రపతిగా తెలంగాణ రాష్ట్రఏర్పాటుకు సంబంధించిన బిల్లుపై సంతకం చేసి తెలంగాణ ప్రజల సుదీర్ఘ కలను సాకారం చేసిన మహానేత సేవలు సదా చిరస్మరణీయం. వీరు ఆగష్టు 31,2020వ తేదీన పరమపదించారు. వీరి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, రెండు నిమిషాల పాటు మౌనం పాటిద్దాం.

(ఈ దశలో సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది.)

MR SPEAKER:- Now, I request the Hon'ble Chief Minister to move Condolence Motion of Sri Solipeta Ramalinga Reddy, Member, Dubbaka Assembly Constituency.

శ్రీ కె. చంద్రశేఖర రావు:- అధ్యక్షా, ఇటువంటి బాధాకరమైన, దుఃఖకరమైన తీర్మానాన్ని ప్రవేశపెట్టవలసి వస్తుందని నా ఊహకు కూడా లేకుండెను. అయినప్పటికీ విధిగా కొంత బాధాతప్త హృదయంతోనే ఈ తీర్మానాన్ని ప్రవేశ పెడుతున్నాను. తెలంగాణ శాసనసభ సభ్యులు శ్రీ సోలిపేట రామలింగారెడ్డిగారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయాలని నేను అర్థిస్తున్నాను.

తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ఎదిగి వచ్చిన నాయకుడు శ్రీ సోలిపేట రామలింగారెడ్డిగారు. నిత్యం ప్రజల మధ్యనే మనుగడ సాగించిన నిరాడంబర నేతగా ప్రజల

హృదయాల్లో సోలిపేట రామలింగారెడ్డి చెరగని ముద్ర వేశారు. ఆయన చాలా చిన్న వయస్సులో ఆనారోగ్యంతో హఠాన్మరణంపాలు కావడం విషాదం. రామలింగారెడ్డిగారి ఆకస్మిక మరణం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న దుబ్బాక నియోజకవర్గ ప్రజలతోపాటు యావత్ తెలంగాణ ప్రజల హృదయాలను కూడా కలచివేసింది. 1962 అక్టోబర్ 2వ తేదీన సిద్ధిపేట జిల్లా, చిట్టాపూర్‌లోని సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన రామలింగారెడ్డి విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు. ప్రజల హక్కులను కాపాడటానికి పత్రికలు ఉపయోగపడుతాయనే విశ్వాసంతో జర్నలిస్టు వృత్తిని ఎన్నుకున్నారు. వామపక్ష భావాలతో ప్రేరేపితులైన శ్రీ రామలింగారెడ్డి మెదక్ జిల్లా ప్రజాక్షేత్రంలో ఎగిసిపడిన ఉద్యమాలకు బాసటగా నిలిచారు. జర్నలిస్టు సంఘం నాయకుడుగా కూడా రామలింగారెడ్డిగారికి ప్రత్యేక స్థానం ఉంది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రామలింగారెడ్డి రాజీలేని పోరాటాలు నిర్వహించారు. సోలిపేట రామలింగారెడ్డి శాసనసభ్యుడు కాకముందు నుండి నాకు ఆయనతో ఆత్మీయమైన అనుబంధం ఉన్నది. ఆయన మొదటి నుంచి తను నమ్మిన ఆదర్శాలను ఆచరణలో పెట్టిన అభ్యుదయవాది. శ్రీ సోలిపేట రామలింగారెడ్డి గారు వరకట్నం, ఇతర ఆడంబరాల ప్రసక్తి లేకుండా సభావివాహం చేసుకున్నారు. ప్రజాకవి కాళోజీ రావుగారితోపాటు ఆనాటి సిద్ధిపేట శాసనసభ్యుడినైన నాచేతుల మీదుగా ఆ వివాహం జరిగింది. ఆ ఆదర్శాన్ని తన వరకే పరిమితం చేయకుండా తన పిల్లలకు కూడా అదే పద్ధతిలో వివాహాలు జరిపించిన ఆచరణశీలి శ్రీ రామలింగారెడ్డి గారు. తెలంగాణ ఉద్యమక్రమంలో రామలింగారెడ్డిలో ఉన్న చురుకుదనాన్ని, నిబద్ధతను, నాయకత్వ లక్షణాలను గమనించి నేను స్వయంగా ఆయనను రాజకీయ రంగంలోకి తీసుకొచ్చాను. 2004వ సంవత్సరం ఎన్నికల్లో దుబ్బాక శాసనసభ స్థానానికి తెలంగాణ రాష్ట్ర సమితి అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించిన రామలింగారెడ్డి యువనాయకుడుగా శాసనసభలో అడుగుపెట్టారు. ఒకవైపు ప్రజాసేవలో నిమజ్జనమవుతూనే మరోవైపు మెదక్ జిల్లాలో తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో శ్రీ రామలింగారెడ్డి చురుకైన పాత్ర పోషించారు.

12.20 మ. ఉద్యమ ప్రతిగాధకులను ఎండగట్టడంలోను, ప్రతిఘటించడంలోనూ రామలింగారెడ్డి ఎంతో సాహసంతో పదునుగా వ్యవహరించారు. సమైక్యవాద నాయకులు కల్పించే ప్రలోభాలకు లొంగకుండా చెదరని సంకల్పంతో పోరాటంలో నిలిచారు. ఉద్యమ ప్రయోజనాల కోసం నాయకత్వం నిర్దేశించినప్పుడు తన ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామ చేయడానికి సిద్ధపడ్డారు. 2009వ సంవత్సరంలో ఒకసారి పరాజయంపాలైనా మొక్కవోని దీక్షతో పని చేసి, తిరిగి ప్రజల విశ్వాసం పొంది 2014, 2018వ సంవత్సర ఎన్నికల్లో వరుసగా భారీ మెజారిటీతో గెలుపొందిన రామలింగారెడ్డి అంచనాల కమిటీ అధ్యక్షులుగా కూడా సేవలందించారు. సిద్ధి పేటలోని జర్నలిస్టుల కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కట్టుకున్న సాధారణమైన ఇంట్లోనే చివరిదాక నిరాడంబరంగా జీవించారు. ఉదయం లేచింది మొదలు నియోజకవర్గ ప్రజల ఆపతి, సంపతి అరుసుకోవడం తప్ప తనకు వేరే లోకం ఉండేది కాదు. ప్రజల కోసం పని చేయడమే జీవన విధానంగా ఎంచుకున్న అరుదైన నాయకుడు శ్రీ రామలింగారెడ్డి. మధుమేహం వ్యాధితో బాధపడుతున్న రామలింగారెడ్డిగారికి కాలికి గాయమై అది ప్రమాదకరంగా పరిణమించడంతో గత ఆగస్టు, 5వతేదీన అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. గౌరవ శాసనసభ్యులు శ్రీ రామలింగారెడ్డిగారి మృతి పట్ల శాసనసభ ఏకగ్రీవంగా తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ తీర్మానిస్తున్నది. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

جناب سید احمد پاشاہ قادری (JANAB SYED AHMED PASHA QUADRI, YAKUTPURA CONSTITUENCY):

جناب اسپیکر صاحب! ہمارے ہاؤز کے ایک سابق ممبر سری سولی پیٹا راما لنگا ریڈی صاحب کے انتقال پر سی ایم صاحب کی جانب سے جو تحریک تعزیت پیش کی گئی ہے، یقیناً ہم اس کی تائید کرتے ہیں۔ راما لنگا ریڈی صاحب ایک عوامی شخصیت تھے اور اپنے علاقوں میں کافی مقبول تھے۔ پہلے وہ دوسری جماعتوں میں رہ کر عوام کی خدمت کرتے تھے، لیکن ٹی آر ایس میں شمولیت کے بعد عوام کی مزید خدمت کے پیش نظر ان کی شہرت میں کافی اضافہ ہوا۔ وہ عملی طور پر عوام کے درمیان رہ کر کام کیا کرتے تھے۔ اسی لئے وہ بھاری اکثریت سے منتخب ہوتے گئے۔ یقیناً جو شخصیت عوام کی ہر دلعزیز ہو جاتی ہے، اس کی جدائی پر لوگ افسوس کا اظہار کرتے ہیں۔ میں بہر حال ان کے افراد خاندان کے ساتھ اظہار ہمدردی کرتا ہوں۔ شکریہ۔

శ్రీ కె.తారకరామారావు (సిరిసిల్ల):- అధ్యక్షా, గౌరవనీయులు స్వర్గీయ సోలిపేట రామలింగారెడ్డిగారి మరణానికి సంబంధించిన సంతాప తీర్మానాన్ని శాసనసభలో పెట్టాల్సి వస్తుందని, దాన్ని బలపరుస్తూ మాట్లాడాల్సి వస్తుందని మా సహచరులందరూ కూడా కలలో ఊహించలేదంటే అది అతిశయోక్తి కాదు. ప్రతి శాసనసభ సమావేశాల్లో అందరితోపాటు ఎంతో చురుకుగా కలుపుగోలుతనంతో ఎప్పటికప్పుడు మమ్మల్నందరిని ఉత్తేజితపరుస్తూ మాతో తిరిగిన సహచరుడు మాతో లేడనే బాధతో మా గుండెలు కూడా బరువెక్కుతున్నాయి. గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు రామలింగారెడ్డిగారు గొప్ప వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి. అత్యంత నిరాడంబరమైన జీవన విధానంతో మొదటి నుండి గొప్ప అభ్యుదయ భావాలు కలిగి ఉండేవారు. ముఖ్యమంత్రిగారు సిద్ధిపేటలో ఆనాడు శాసన సభ్యుడుగా ఉన్నప్పుడు, ప్రజాకవి కాళోజి నారాయణరావుగారి సమక్షంలో రామలింగారెడ్డిగారు సుజాతగారిని స్టేజ్ మ్యారేజ్ చేసుకున్నప్పటి చిత్రాలను సామాజిక మాధ్యమాలలో అందరం చూశాము. ఆ రోజు నుండి ఆయన చనిపోయే దాకా అదే సింప్లిసిటి, అదే రకమైన కలుపుగోలుతనం, నిగర్వీగా రాజకీయాలకు సంబంధం లేకుండా పార్టీలకు అతీతంగా సభలోని సభ్యులందరితో చాలా గొప్పగా కలిసిమెలసి ఉండేవారు. గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు జర్నలిస్టుగా, కలం వీరుడుగా ఉద్యమానికి తొలినాళ్లల్లో మద్దతును ఇచ్చి 2004వ సంవత్సరం నాటికి తెలంగాణ రాష్ట్రసమితి పక్షాన దుబ్బాక టికెట్‌ను వారు పొందారు. 2004వ సంవత్సరంలో రాష్ట్రంలోనే పెద్దఎత్తున టి.ఆర్.ఎస్. టికెట్ కోసం అత్యంత ఎక్కువ అప్లికేషన్లు వచ్చింది, ఎక్కువ పోటీ పడింది ఎక్కడ అంటే అది దుబ్బాక నియోజకవర్గంలోనే అని చెప్పవచ్చు. 30పై చిలుకు పోటీదారులు ఉన్నా అందులో ధనవంతులు, సంపన్నులు కోకొల్లలుగా ఉన్నా ఒక నిబద్ధత కలిగిన నాయకుడుగా, చిత్తశుద్ధి కలిగిన కార్యకర్తగా రామలింగారెడ్డి గారు అయితేనే అప్పటి దొమ్మాట నియోజకవర్గానికి న్యాయం చేయగలుగుతారనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రిగారు స్వయంగా ఆనాడు ఆయనను ఎంచుకుని వారిని అక్కడ నుంచి పోటీకి నిలపడం జరిగింది. ముఖ్యమంత్రిగారు ఏ అచంచల విశ్వాసాన్ని అయితే ఆయన మీద పెట్టారో ఆ విశ్వాసాన్ని వమ్ము కానివ్వకుండా మధ్యలో ఎన్నో రకాల కుట్రలు, కుతంత్రాలు ప్రలోభపెట్టే ప్రయత్నాలు అప్పటి అధికార పార్టీ చేసినా వాటన్నింటికి లొంగకుండా నిబద్ధతతో తుది దాక కేసీఆర్‌గారి వెంట నడచిన నాయకుల్లో రామలింగారెడ్డిగారు అగ్రభాగాన ఉంటారని తెలియజేస్తున్నాను.

నాకు వారితో 2003వ సంవత్సరం నుంచి పరిచయం ఉన్నది. 2006వ సంవత్సరంలో గౌరవ ముఖ్యమంత్రిగారు ఉద్యమ నాయకుడుగా రాష్ట్రంలోని రైతాంగం ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యల మీద రాజీవ్ రహదారి దిగ్బంధానికి పిలుపునిచ్చారు. ఆ సందర్భంగా నన్ను దొమ్మాట నియోజక వర్గంలోని కుకునూరు పల్లి, కొండపాక ప్రాంతానికి ఇన్‌చార్జ్‌గా వేస్తే ఆనాడు నేను వారితో స్వయంగా కార్యక్షేత్రంలో కలిసి పనిచేశాను. స్థానికంగా ఉన్న రైతాంగంతోగానీ, కార్యకర్తలతోగానీ వారు ఎంత కలుపుగోలుతనంతో, ఎమ్మెల్యేను అనే అహంభావం లేకుండా నిరాడంబరంగా అన్నా, తమ్మి అంటూ వాళ్ల భుజాల మీద చెయ్యి వేసి చక్కగా ఒక సోదరుడిగా కలిసిపోయే ఆత్మీయమైన మంచి నాయకున్ని మనం కోల్పోయాము.

2006-07వ సంవత్సరంలో విద్యుత్తు సమస్యల ఉద్యమం కానీ, గౌరవ ముఖ్యమంత్రిగారు 2009వ సంవత్సరంలో సిరిసిల్ల నుంచి శాసనసభ్యునిగా పోటీ చేసే అవకాశం ఇచ్చినప్పుడు నా కోసం రామలింగారెడ్డిగారు ముస్తాబాద్, ఎల్లారెడ్డి పేట మండలానికి వచ్చారు. నాకోసం వారి మిత్రులతో మరియు ఇతరులతో చెప్పి తప్పకుండా రామును గెలిపించండి మీ నియోజకవర్గానికి మంచి జరుగుతుందని తన ఎన్నిక అన్నంతగా తాపత్రయపడి చాలా కష్టపడ్డారు. 2014వ సంవత్సరంలో రాష్ట్రం వచ్చిన తర్వాత

నేను చేనేత, జౌళి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు పట్టుబట్టి దుబ్బాకకు తీసుకుని వెళ్లారు. దుబ్బాకలో చేనేత కార్మికులు చాలా పెద్దఎత్తున ఉంటారు రాము నువ్వు రావాలి వారికి సహాయం చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రిగారు స్వయంగా దుబ్బాకలో చదువుకున్నారు ఆ ఊరు గురించి వారికి బాగా తెలుసు. అక్కడి నేతన్నల సమస్యల గురించి కూడా వారికి బాగా తెలుసు. నన్ను దుబ్బాకకు పట్టుబట్టి తీసుకుని వెళ్లి వారి కోసం రుణమాఫీ చేయించిన ఘనత రామలింగారెడ్డిగారికే దక్కుతుంది.

బాధాకరం ఏమంటే తుదినాళ్లల్లో వారు అనారోగ్యపాలైనారు. గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు వారికి మధుమేహం ఉండేది. వారు ఆరోగ్యాన్ని పెద్దగా పట్టించుకునే వారు కాదు. ఎప్పుడూ ప్రజా సేవలో నిమజ్ఞమై మధుమేహాన్ని కూడా పట్టించుకోలేదు. అనుకోకుండా కాలికి గాయం అయి సెప్టిక్ కావడం వల్ల ఆయన ఆసుపత్రిలో చేరడం జరిగింది. వారు ఆసుపత్రిలో చేరిన చాలా కాలానికి వారి గురించి నాకు తెలిసింది. స్థానిక నాయకుడు నాకు ఫోన్ చేసి అన్నా రామలింగారెడ్డి గారు సీరియస్‌గా ఉన్నాడంటే మొదట నేను మాములు అంశం అనుకున్నాను తర్వాత విషయం తెలిసి వెంటనే ఆసుపత్రిని సంప్రదించి డాక్టర్లతో మాట్లాడితే ఇప్పటికే చాలా ఆలస్యం అయింది చాలా క్రిటికల్‌గా ఉన్నారని చెప్పినప్పుడు చాలా బాధపడ్డాము. ఒక మాట మాత్రం వాస్తవం. ప్రస్తుత రాజకీయాలలో రామలింగారెడ్డి లాంటి నాయకులు చాలా అరుదుగా ఉంటారు. ఎందుకంటే మొదటి నుంచి ఎమ్మెల్యే అని కానీ, అంచనాల కమిటీకి అధ్యక్షులని కానీ, అధికార పార్టీ శాసనసభ్యులని కానీ ఎప్పుడూ గర్వపడలేదు. సాధారణంగా అందరితో కలుపుగోలు తనంతో కలిసిమెలిసి ఉంటే మంచి నాయకున్ని కోల్పోయినందుకు మనసారా బాధపడుతున్నాను. వారి భార్య అయిన శ్రీమతి సుజాతగారికి వారి కుటుంబసభ్యులకు, బంధుమిత్రులకు, నియోజకవర్గ ప్రజలకు నా పక్షాన హృదయపూర్వకమైన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

12.30 ము. **శ్రీ కొప్పుల ఈశ్వర్ (ధర్మపురి):** అధ్యక్షా, సోలిపేట రామలింగారెడ్డి గారి యొక్క అకాల మరణం సందర్భంగా ఈరోజు శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. రామలింగారెడ్డి గారు మాకు ఉద్యమ సహచరులు. వారి యొక్క అకాల మరణం విన్న వెంటనే ఒక నిమిషం చలించిపోయి, ఇది నిజమా అనే పరిస్థితి ఏర్పడింది. వాస్తవంగా రామలింగారెడ్డి గారు అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు. ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి, శాసన సభ్యుడిగా ఎదిగిన నాయకుడు. మెదక్ జిల్లా దుబ్బాక మండలం చిట్టాపూరు గ్రామంలో 1962వ సంవత్సరంలో జన్మించారు. మొదటి నుంచే అభ్యుదయ భావాలతో, వామపక్ష భావాలతో ఉన్న రామలింగారెడ్డి గారు, ఉదయం దినపత్రిక ద్వారా తన జీవన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, 1985వ సంవత్సరంలో మన గౌరవ ముఖ్యమంత్రి గారు ఆనాడు శాసనసభ్యులుగా ఉన్న సందర్భంలో సుజాత అనే మహిళను ఆదర్శ వివాహం చేసుకోవడం జరిగింది. ఆనాడే ఆదర్శ భావాలను చాటి చెప్పిన నాయకుడు. అంతేకాకుండా ఆయన కొడుకుకు గాని, కూతురుకు గాని, ఆయన చేరదీసిన వాళ్లకు కూడా ఆదర్శ వివాహాలు జరిపించడం జరిగింది. రామలింగారెడ్డి గారి మరణ వార్త తెలిసిన వెంటనే గౌరవ ముఖ్యమంత్రి గారు, వారి గ్రామానికి వెళ్లి వారి అంత్యక్రియల్లో పాల్గొన్న సందర్భంలో ఒక ఉద్యమ నాయకుడిని కోల్పోతే ఎంత బాధగా ఉంటుందో కేసీఆర్ గారి ఆవేదన ఆరోజు చూడటం జరిగింది. ఈరోజు వారు మాట్లాడిన మాటల్లో కూడా ఇటువంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఇటువంటి తీర్మానాన్ని ప్రవేశపెట్టవలసి వస్తుందని కంటతడి పెట్టిన మహా నాయకులు కేసీఆర్ గారు. వారితో ఉద్యమ సమయంలో రామలింగారెడ్డి గారు కలిసి పని చేయడం జరిగింది. ఈనాడు అనేక మంది మంత్రులుగా, శాసన సభ్యులుగా, ఇతర హోదాలలో ఉన్నటువంటి వారు తెలంగాణ ఉద్యమ నాయకులు. వారి నియోజక వర్గానికి సంబంధించిన అనుచరులు మరియు ప్రజలందరూ కూడా ఈ యొక్క వార్తను ఇనుమడించుకోలేని పరిస్థితిని ఆరోజు చూశాం.

రామలింగారెడ్డి గారు విద్యార్థి దశ నుండే ఉద్యమాల వైపు వెళుతూ, ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ప్రశ్నించే తత్వం కలిగిన నాయకుడు. ఆనాడు ఉద్యమ విద్యార్థి నాయకుడిగా ఉన్న సందర్భంలో విద్యార్థుల యొక్క సమస్యల పట్ల నాయకత్వం వహించి, డొనేషన్ల చదువులు వద్దని విద్యార్థులను చైతన్యపరచడం జరిగింది. ఆనాడు విప్లవ విద్యార్థి సంఘాలు అయిన పిడిఎస్‌యు, ఆర్‌ఎస్‌యు వంటి ఉద్యమ సంఘాల వైపు వెళ్లిన నాయకుడు. అదే విధంగా ఉదయం దినపత్రికలో దుబ్బాక మండలం నుంచి తన యొక్క ప్రస్థానాన్ని ప్రారంభించి, జర్నలిస్టులకు కూడా అనేక సేవలు అందించి, దాదాపు రెండు పర్యాయాలు జిల్లా జర్నలిస్టుల సంఘం అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించడం జరిగింది. ఈ విధంగా ప్రజల్లోనే ఉంటూ, ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నిస్తూ, ఒక పాత్రికేయుడిగా తన బాధ్యతను నిర్వహిస్తున్న సందర్భంలో అనేక ఇబ్బందులు, కష్టనష్టాలను ఎదుర్కొన్నటువంటి నాయకుడు. ఆ క్రమంలో తన పైన అనేక పోలీస్ కేసులు నమోదైన విషయాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకుంటున్నాం. ఆనాడు నక్సలైట్ ఉద్యమం జరుగుతున్న సందర్భంలో పోలీసులు, నక్సలైట్లు వీరిద్దరి మధ్య నలుగుతున్న ప్రజల పైన అనేక నిర్బంధాలు. వీటన్నింటిని వ్యతిరేకిస్తూ, ప్రజలను చైతన్యవంతులను చేయడం జరిగింది.

ఆరోజు పత్రిక కథనాలు రాస్తున్న సందర్భంలో రామలింగన్న పైన ఆనాడు ఉన్న ప్రభుత్వం దేశ చరిత్రలోనే ఎప్పుడు లేనటువంటి విధంగా టాడా కేసులో ఆయనను ఇరికించడం వల్ల ఆయన దాదాపు మూడు నెలలు జైలు జీవితం అనుభవించడం జరిగింది. ఈ యొక్క సంఘటన దేశ వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా ఒక విలేఖరి పైన ఇటువంటి టాడా చట్టాన్ని ఉపయోగించిన పరిస్థితి లేదనే విషయం సంచలనం కలిగించింది. ఈ విధంగా రామలింగన్న జీవితం కొనసాగుతున్న సందర్భంలో కేసీఆర్ గారు తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగింది. ఆ సమయంలో 2001వ సంవత్సరంలో కేసీఆర్ గారి పిలుపు మేరకు తెలంగాణ ఉద్యమంలో రామలింగారెడ్డి గారు మమేకమయ్యారు. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రం తీసుకున్న అనేక కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. కేసీఆర్ గారికి ఒక నమ్మకమైన నాయకుడిగా ఉద్యమ ప్రస్థానంలో తనకంటు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఒక చురుకైన నాయకుడిగా టిఆర్ఎస్ పార్టీలో ఎంతో ఎత్తుకు ఎదిగారు. వారి సేవలను గుర్తిస్తూ, గతంలో కేసీఆర్ గారితో ఉన్న సంబంధాన్ని పురస్కరించుకుని, స్వయంగా వారే స్టేజ్ మ్యారేజ్ చేసుకున్నారు. ఆ విషయాలను గుర్తించి 2004వ సంవత్సరంలో దొమ్మాట నియోజకవర్గం నుంచి రామలింగారెడ్డి గారు శాసనసభ్యుడిగా పోటీ చేసే అవకాశాన్ని కేసీఆర్ గారు కల్పించడం జరిగింది. ఆనాడు ఉన్న మంత్రి ముత్యం రెడ్డి పైన భారీ మెజారిటీని సాధించి మొట్టమొదటి సారిగా అసెంబ్లీలో అడుగుపెట్టడం జరిగింది. 2008వ సంవత్సరం ఒక ప్రత్యేకమైన సందర్భం. ఎందుకంటే అప్పటికే తెలంగాణ ఉద్యమం 8 సంవత్సరాల నుండి ఉధృతంగా సాగుతున్నది.

12.40 మ. తెలంగాణ రాష్ట్రాన్ని కోరుతున్న సందర్భంలో, చాలా ఉద్యమ కార్యక్రమాలు ప్రజలు చేస్తున్న సందర్భంలో, అది రైల్ రోకో కావచ్చు, మిలియన్ మార్చ్ కావచ్చు, రహదారుల దిగ్బంధనం కావచ్చు, సకల జనుల సమ్మె కావచ్చు, చివరకి కేసీఆర్ గారి యొక్క ఆమరణ నిరహార దీక్ష కావచ్చు ఇటువంటి కీలక సందర్భాల్లో రామలింగారెడ్డిగారి యొక్క పాత్ర తెలంగాణ ఉద్యమంలో గణనీయంగా పోషించిన మా ఉద్యమ సహచరుడు, మిత్రుడు రామలింగా రెడ్డిగారు. అదేవిధంగా ఉద్యమాలు మనం ప్రపంచవ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా చూసినట్లైతే ప్రజలు రకరకాల పద్ధతులలో నిరసనలు తెలియజేయడం చూస్తుంటాము. కానీ, తెలంగాణ ఉద్యమంలో కొన్ని సందర్భాలను చూసినట్లైతే ఒక ప్రత్యేకమైన రూపం తెలంగాణ ఉద్యమంలో కనబడుతుంది. 2008, 2009, 2010 మరియు 2014వ సంవత్సరాలలో ప్రజలు ఉద్యమాలు వివిధ రూపాల్లో చేయడంతోపాటు, ప్రజాస్వామ్యంలో అత్యున్నత విలువలు కలిగినటువంటి శాసన

సభ్యులుగా ఉన్నటువంటివారు, ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు, పార్లమెంటు సభ్యులుగా ఉన్నటువంటి వారు మూకుమ్మడిగా పదవులకు రాజీనామాలు చేయడం తెలంగాణ ఉద్యమంలో మనం ప్రత్యేకంగా చూస్తుంటాము. గతంలో ఇటువంటి శాంతియుతమైన ఉద్యమం మనం చూసి ఉండము. 2008వ సంవత్సరంలో ఒకవైపు తెలంగాణ ఉద్యమం, అనేక పోరాటాలు, ఆత్మహత్యలు జరుగుతున్న సందర్భంలో కూడా ఆనాడు అధికారంలో ఉన్న ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల టీఆర్‌యస్ పార్టీ గౌరవ ఉద్యమ నేత కేసీఆర్‌గారు ఈ పదవులు మనకెందుకు తెలంగాణ ఉద్యమాన్ని ఇంకా ఉధృత రూపం దాల్చాలంటే తప్పకుండా మనం త్యాగాలు చేయాలనే ఉద్దేశంతో ఆనాడు పదహారు మంది శాసనసభ సభ్యులు, నలుగురు పార్లమెంటు సభ్యులు, నలుగురు శాసన మండలి సభ్యులు జడ్పీటీసీలు, ఎంపీపీలు మరియు రాష్ట్రంలో ఉన్న ప్రజాప్రతినిధులందరు కూడా మూకుమ్మడిగా రాజీనామా చేసిన సందర్భం. ఆరోజు రామలింగారెడ్డిగారు తమ విలువైన స్థానాన్ని తెలంగాణ ఉద్యమం కోసం రాజీనామా సమర్పించిన ఉద్యమకారుడు రామలింగారెడ్డిగారు. తెలంగాణ ప్రజలు ఆదరించి, తనను కడుపులో పెట్టుకుని గెలిపించిన సందర్భాన్ని ఈ రోజు మనం గుర్తుకు తెచ్చుకోవాలి. 2009వ సంవత్సరంలో ఓడిపోవడం జరిగింది. 2014వ సంవత్సరంలో వారు భారీ మెజార్టీతో వారు విజయం సాధించారు. 2018వ సంవత్సరంలో 62,500వేల భారీ మెజార్టీతో రామలింగారెడ్డిగారు ఈ యొక్క నియోజకవర్గంలో విజయం సాధించడం జరిగింది. రామలింగారెడ్డిగారు ఈరోజు మనందరికి భౌతికంగా దూరం ఉన్నప్పటికి కూడా కొన్ని సంవత్సరాలుగా చేసిన సేవలు, ప్రజలతో మమేకమై వారు నిర్వర్తించిన పాత్ర ప్రజల గుండెల్లో శాశ్వతంగా ఉండే విధంగా వారి యొక్క ప్రవర్తన ఉంది. ఉద్యమ సమయంలో అనేక అటుపోటులు వచ్చినప్పుడు, ఆనాటి ఉద్యమ సందర్భంలో తెలంగాణ ఉద్యమాన్ని ఏ విధంగా విచ్ఛినం చేయాలి, తెలంగాణ రాష్ట్రసమితిని లేకుండా చేయాలి, ఇందులో ఉన్న నాయకులను చిన్నాబిన్నం చేయాలని దుర్మార్గమైన ఆలోచన జరుగుతున్న సందర్భంలో టీఆర్‌యస్ పార్టీకి కేసీఆర్‌గారి నాయకత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన నాయకులు రామలింగారెడ్డిగారు. వారు అసాధారణమైన వ్యక్తి అని చెప్పడంలో ఏటువంటి సందేహం లేదు. చాలా మంది రాజకీయాల్లోకి వచ్చేటప్పుడు ఎంతో ఆవేశంతో సమాజానికి ఏదో చెయాలనే ఉద్దేశంతో రాజకీయల్లోకి రావడం, విజయం సాధించడం అధికారంలోకి వచ్చిన తరువాత వాటన్నిటిని తేలికగా తీసుకోవడం అనేది మనం చూస్తుంటాము. కానీ కాలక్రమేణా రోజురోజుకు నాయకత్వం రిఫైన్ అవుతూ, నాయకుల యొక్క క్వాలిటి పెరుగుతున్నది. ప్రజల పక్షాన మమేకమై పనిచేసే నాయకులే దాదాపు ఎక్కువగా వస్తున్నారు. ఆ కోవకు చెందని వారిలో రామలింగన్న మొదటి రోజు నుంచి ఇప్పటివరకు కూడా ప్రజలను వదిలిపెట్టికానీ, సమస్యలను వదిలిపెట్టి కానీ, అదేవిధంగా ఉద్యమపార్టీని, నాయకత్వాన్ని వదిలిపెట్టి ఉన్న నాయకులు కాదు. అందుకే రామలింగారెడ్డిగారికి మంచి పేరు, గుర్తింపు ప్రజల్లో ఉంది. వారి యొక్క మరణాన్ని ఎవరు కూడా జీర్ణించుకోలేని పరిస్థితి. అటు నియోజకవర్గంలోగానీ, టీఆర్‌యస్‌పార్టీలో తనతో పనిచేసిన సహచరులందరు కూడా బాధాకరమైన విషయంగా ఈరోజు గుర్తించడం జరుగుతోంది. అదేవిధంగా రామలింగారెడ్డిగారు శాసనసభకు ఐదు పర్యాయాలు పోటిచేసి నాలుగు సార్లు గెలుపొందడం జరిగింది. వారు అంచనాల కమిటి ఛైర్మన్‌గా రెండు సార్లు పూర్తి స్థాయి బాధ్యతలు నిర్వహించడం జరిగింది. వారియొక్క అకాల మరణం చాలా బాధాకరం. 06.08.2020న వారు అంతిమ శ్వాస వదిలారు. చివరి నిమిషం వరకు ప్రజలతో, ప్రజాసమస్యలతో మమేకమైన నాయకులు రామలింగారెడ్డిగారు. సోలిపేట రామలింగన్న తెలంగాణ రాష్ట్ర చరిత్రలో, ఉద్యమ చరిత్రలో తప్పకుండా నిలిచిపోయేటటువంటి నాయకుడు. వారి యొక్క ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఉద్యమ సహచరులుగా మేము మీకు ఇచ్చే నివాళి జోహార్ సోలిపేట రామలింగారెడ్డి జోహార్.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క :- అధ్యక్ష, మిత్రులు మనందరి మధ్యన ఈ సభలో కూర్చున్నటువంటి వ్యక్తి శ్రీ సోలిపేట రామలింగారెడ్డి గారు నేడు లేరు అని చెప్పడానికి చాలా బాధగా ఉంది. వారు అనేక సంవత్సరాలుగా మనందరి మధ్యన ఈ శాసనసభలో కూర్చోని రాజకీయపార్టీలో వైరుధ్యం ఉన్నప్పటికీ కూడా అందరితో మమేకమవుతూ ఒక గొప్ప మానవతావాదిగా ఉన్న సోలిపేట రామలింగారెడ్డి గారి మరణ వార్త చాలా తీవ్రమైన దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ మధ్యకాలంలో అనేక రకాలుగా వస్తున్న వ్యాధుల సందర్భంలో సోలిపేట రామలింగారెడ్డి గారు వారి ఆరోగ్యాన్ని ఏ విధంగా చూసుకున్నారో తెలియదు కానీ, మనమందరం చూస్తున్నప్పుడు ఆరోగ్యంగానే కనిపించేవారు. ఆయన మరణం ఈ సభలో కూర్చున్న మనందరికీ చాలా బాధగా అనిపిస్తోంది. తోటి శాసన సభ్యుడు సభలో లేకుండా పోయాడే అనే బాధ మనందర్ని కలచివేస్తోంది. సోలిపేట రామలింగారెడ్డిగారి లాంటి నాయకుడు ముఖ్యంగా విద్యార్థి దశ నుండి వామపక్ష భావజాలానికి ఆకర్షితులై సమాజంలో ఉన్న పేదవారి కోసం సమసమాజ స్థాపన కోసం పోరాటం చేస్తున్న ఆనాటి విద్యార్థి ఉద్యమంలో పాల్గొని తరువాతి క్రమంలో మళ్లీ ఉదయం అనే దిన పత్రికలో వారు జర్నలిస్టుగా చేరి, జర్నలిజం ద్వారా సమాజ మార్పుకోసం భావజాలాన్ని అమలు చేయడం కోసం వారు నిరంతరం తపిస్తు రాసిన అనేక వార్తలు చాలా సందర్భాల్లో సర్క్యులేషన్‌లో చదివిన తరువాత మనకు తెలియని సోలిపేట రామలింగారెడ్డి ఉన్నాడనే భావన మనకు కలిగింది.

రామలింగారెడ్డి గారు నాలుగు టెర్మ్‌లలో మూడుసార్లు ఈ శాసనసభకు ప్రాతినిధ్యం వహించి వారి ఆలోచనలు, భావాలను అనేకసార్లు ఇక్కడ వ్యక్తం చేయడం మనం గమనించాం. వారి మరణం తీవ్రమైన లోటుగా నేను భావిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని నేను పూర్తిగా బలపరుస్తున్నాను.

అధ్యక్షా, మీరు అనుమతిస్తే ఇంకొక సూచన చేయదలుచుకున్నాను. ఈ క్లిష్ట సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ఉండి విధులు నిర్వహిస్తూ కరోనా బారిన పడి వైద్య సిబ్బంది, డాక్టర్లు, పోలీసు సిబ్బంది చాలా మంది మరణించారు. వారికి కూడా మనం ఇక్కడొక సంతాప తీర్మానం ప్రవేశపెడితే బాగుంటుందని మీద్వారా కోరుతూ, మరొకసారి రామలింగారెడ్డి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వేముల ప్రశాంత్‌రెడ్డి (బాల్కొండ):- అధ్యక్షా, స్వర్గీయ సహచర శాసన సభ్యులు, అంచనాల సమితి ఛైర్మన్ శ్రీ రామలింగారెడ్డి గారి మరణం పట్ల గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తున్నాను.

ఆనాటి ఉద్యమ నాయకుడుకేసీఆర్ గారి నాయకత్వంలో సాగినటువంటి ఉద్యమంలో మనందరితోబాటు ఎదిగిన నాయకుడు రామలింగారెడ్డి గారు. మూడు టెర్మ్‌లలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుత సెకండ్ అసెంబ్లీతో కలుపుకుని రెండుసార్లు అంచనాల సమితి ఛైర్మన్‌గా పని చేసిన వ్యక్తి. చాలా నిరాడంబరమైన జీవితాన్ని కొనసాగించారు. టిఆర్ఎస్ పార్టీలో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరితో కలుపుగోలుగా ఉండే వారు. నిజంగా వారు మన మధ్యలో లేరని, వారి గురించి ఇటువంటి తీర్మానం ప్రవేశపెట్టబడుతుందని, ఇలా మాట్లాడవలసి వస్తుందని ఊహించలేదు. నిజానికి చాలా బాధగా ఉంది. అందరూ చెప్పినట్లు ఆయన విద్యార్థి దశలోనే ప్రజోద్యమాల వైపు ఉండి, తదనంతరం జర్నలిస్టుగా జీవితాన్ని ప్రారంభించి, ఆనాడుకేసీఆర్ గారు తెలంగాణ రాష్ట్రం సాధన కోసం ప్రారంభించినటువంటి టిఆర్ఎస్ పార్టీలో చేరి సిద్ధిపేట, దుబ్బాక ప్రాంతాలలో చాలా తిరిగి పని చేసిన వ్యక్తి. వారు గతించిన తర్వాత, మరుసటి రోజు ఆయన కడసారి చూపు కోసం గౌరవ ముఖ్యమంత్రి గారు వెళ్లినపుడు వారితోబాటు నన్ను కూడా కారులో తీసుకెళ్లారు. ఆ సందర్భంలో గౌరవ

ముఖ్యమంత్రి గారు పాత స్మృతులను మననం చేసుకుంటూ 2004 సంవత్సరం ఎన్నికల నాటి విషయాన్ని ఒకసారి గుర్తు చేయడం జరిగింది. ఇంతకు ముందు కేటీఆర్ గారు చెప్పినట్లు, 2004 శాసన సభ ఎన్నికలలో దుబ్బాక నియోజకవర్గం నుంచి 34 మంది ఆశావహులు పోటీ పడ్డారు. ఎందుకుంటే దుబ్బాక నియోజకవర్గం నూటికి నూరు శాతం టిఆర్ఎస్ పార్టీకే అనుకూలంగా ఉండేది. కాబట్టి అందరూ కూడా ఆశపడ్డారు. అయితే ఆ 34 మందిలో చాలా మంది ధనవంతులు కూడా ఉండే వారు. మన రామలింగారెడ్డి గారు సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చారు. డబ్బులు లేవు, ఆర్థిక స్థోమత ఆల్‌మోస్ట్ జీరో. అయినా సరే, కేసీఆర్ గారు రామలింగారెడ్డి గారినే అభ్యర్థిగా నిర్ణయించారు. ఆ సందర్భంలో అప్పుడున్న పార్టీ సీనియర్ నాయకులు ..... అదేమిటి సార్, చాలా మంది డబ్బులున్న వారు, పెద్దస్థాయి వారు ఉన్నారు కదా, రామలింగారెడ్డి గారినే ఎందుకు ఎంచుకున్నారని అడిగారట. అప్పుడు ఆనాటి ఉద్యమ నాయకుడు కేసీఆర్ గారు ఏమన్నారంటే .. నిజమే, రామలింగారెడ్డికి డబ్బులు లేకపోవచ్చు, కానీ గుండెల నిండా తెలంగాణాన్ని నింపుకొని ఉన్నారు, తప్పకుండా అతను గెలిచి వస్తాడు, అటువంటి నిస్వార్థ నాయకుడు టిఆర్ఎస్ పార్టీకి రేపు రాబోయే తెలంగాణకు కూడా అవసరమని నాయకులతో అన్నారు. ఇంతకు ముందు కేటీఆర్ గారు అన్నట్లు, కేసీఆర్ గారు పెట్టుకున్న నమ్మకాన్ని వంద శాతం ఆయన నిలబెట్టుకున్నారు. పార్టీ కష్టకాలంలో అప్పటి సమైక్యవాదులు ప్రలోభాలు పెట్టి శాసనసభ్యులను మార్చుకునే క్రమంలో కూడా నిబద్ధతతో, నిక్కచ్చిగా చివరి వరకు టిఆర్ఎస్ పార్టీ వెంటే ఉన్నారు రామలింగారెడ్డి గారు. అంతే కాదు, పార్టీ ఎప్పుడు ఏ పని అప్పజెప్పినా, ఏ ఆదేశం ఇచ్చినా ఒక సైనికుడిలా ఔదలదాల్చి పార్టీ పని చేసే వారు.

పార్టీ కార్యక్రమాలకు సంబంధించి నాకు వారితో ఉన్న అనుబంధం గురించి చెబుతాను. 2012లో బై ఎలక్షన్స్ వచ్చినపుడు కామారెడ్డి నియోజకవర్గం నుంచి గంపా గోవర్థన్‌గారు పోటీ చేశారు. ఆ నియోజకవర్గంలోని మాచారెడ్డి మండలంలో నన్ను పని చేయమని పార్టీ ఆదేశించింది. కేటీఆర్ గారు కూడా ఆనాడు కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా పని చేశారు. నేను, మా కార్యకర్తలం అక్కడ పది, పదిహేను రోజులు క్యాంప్ వేశాం. మా పనులు మేము చేసుకుంటూ పోతున్నాం. మాచారెడ్డి మండలంలో రెడ్డిపేట, అన్నారం తదితర గ్రామాలలో రామలింగారెడ్డి గారి బంధువులు చాలా మంది ఉన్నారు. వాళ్లు కొద్దిగా వేరే పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని నాకు సమాచారం వచ్చింది. అప్పుడు రామలింగారెడ్డి గారికి ఫోను చేశాను. అప్పుడు ఆయన కరీంనగర్‌లో ఉన్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా అక్కడ ఉన్నారు. అక్కడ పని చేయమని పార్టీ ఆయనకు బాధ్యత అప్పజెప్పింది, చేస్తున్నారు. నేను ఫోను చేసి, అన్నా మీ బంధువులు ఇక్కడ నాలుగైదు గ్రామాలలో నేను తిరుగుతుంటే ఎదురయ్యారు, వాళ్లు కొద్దిగా వేరే పార్టీ వైపు మొగ్గు చూపుతున్నట్లుగా ఉంది, మీరు రావాలి, వచ్చి వాళ్లను కన్విన్స్ చేయాలి, ఇది హార్డ్ టైము కదా, తెలంగాణ కోసం గంపా గోవర్థన్ రాజీనామా చేశారు, ఎలాగైనా వారిని గెలుపించుకోవాలి కదా, మీరు అక్కడ పని చేస్తున్నారు కానీ తప్పకుండా ఇక్కడికి రావాలన్నాను. ఆయన నిబద్ధతకు ఇదొక ఉదాహరణ. ఆయనకు పార్టీ అప్పజెప్పిన పని కరీంనగర్ నియోజకవర్గంలో పని చేస్తూనే సాయంత్రం ఆరు గంటలకు మాద్గగరకు వచ్చేది. సాయంత్రం ఆరు నుంచి రాత్రి 11, 12 గంటల వరకు మేము చెప్పిన, ఆయనకు సంబంధించిన వ్యక్తుల ఇళ్లకు పర్సనల్‌గా వెళ్లి వాళ్లను కన్విన్స్ చేసి, రాత్రి పొద్దుపోతే వాళ్ల ఇళ్లల్లోనే పడుకొని మళ్లీ ప్రొద్దున్నే 5 గంటలకు లేచి కరీంనగర్‌కు వెళ్లేది. మళ్లీ ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు మాద్గగరకు వచ్చేది. అలా నాలుగు రోజులు వచ్చారు, పార్టీ పని చేశారు. నిజానికి ఆరోజు నేను ఆయన్ని చూసి ఇన్‌స్పైర్ అయ్యాను. నేను ఆయన నుంచి స్ఫూర్తి పొందాను. నిజానికి కేసీఆర్ సైనికుడంటే ఇలా ఉండాలనిపించింది. అందుకే ప్రజలు ఆయన్ని 2004, 20014, 2018 ఇలా మూడుసార్లు ఆశీర్వదించారు, ఆదరించారు, గెలిపించారు.

అధ్యక్షా, ఒక్క పార్టీ పనే కాదు, ప్రజలకు సంబంధించిన పనులు కూడా అలాగే చేసే వారు. దీనికి సంబంధించి నాకొక కోఇన్సిడెన్స్ ఉంది. 2015-18 మధ్యలో మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్‌గా పని చేయడానికి ముఖ్యమంత్రి గారు నాకు అవకాశం ఇచ్చారు. తన నియోజకవర్గంలో అందరికీ మంచినీళ్లు తొందరగా రావాలనే ఆతృతతో, ఎమ్మెల్యేలందరికంటే ఎక్కువసార్లు ఫోను చేసింది, కొత్లాడింది రామలింగారెడ్డి గారే. ఏ గ్రామానికి ఆయన వెళ్లినా, ముందు అడిగే విషయం ఏమంటే, మిషన్ భగీరథ పనులు జరుగుతున్నాయా లేదా అని అడిగేవారు. సమస్య ఏదైనా ఉందంటే, ఆ స్పాట్ నుంచే నాకు ఫోన్ చేసేది. నేను ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా సరే ఫోన్ చేసేది. ఆ స్పాట్ నుంచే ఫోన్ చేసి, అన్నా ఫలానా గ్రామంలో బల్క్ వాటర్ రావడం లేదు, జీఎస్‌బిఆర్‌లో సమస్య ఉంది, పంపు చెడిపోయింది. వెంటనే మీ ఎస్ఇ గారిని పంపించండని నాతో గట్టిగా మాట్లాడేది.

1.00 మ. నేను అటెండ్ అయి వాళ్లను పంపించిన తరువాత మరలా సాయంత్రం వారు నాకు ఫోన్ చేసి పని అయిందా లేదా అనే విషయం నాకు చెప్పేవారు. ప్రజలంటే ఆయనకు అంత కమిట్‌మెంట్ ఉండేది. దుబ్బాక నియోజకవర్గంలో అందరు ఎమ్మెల్యేలకంటే ముందుగా "మిషన్ భగీరథ" ద్వారా నీళ్లు ఇప్పించుకున్నారు. ఆయన చనిపోయే ముందు చివరిసారి నన్ను కలిసినప్పుడు కూడా ఆయన నియోజకవర్గ అభివృద్ధి పనులైన రోడ్లు కావాలని ఒక లిస్టును నాకు ఇవ్వగా ఇప్పుడు కరోనా సమయం కాబట్టి కొద్ది రోజుల తరువాత అడిగిన పనులు చేపిస్తానని సముదాయిస్తుంటే వారు మాట్లాడుతూ మీ నాన్ననే నాకు మంచి మిత్రుడుగా ఉండేవారు, వారుంటే నేను అడిగిన పనులన్నీ వెంటనే చేయించేవారు కానీ నువ్వు ఇవ్వడం లేదని అన్నారు. అంటే వారు ప్రజల కోసం ఎంతవరకైనా వెళ్లగలిగే వ్యక్తి అని మనందరికీ అర్థమవుతున్నది. వారు ప్రజల కోసం ప్రేమతో అడిగేది, హక్కుతో అడిగేది, కొత్లాడి కూడా సాధించుకునేవారు. ఇవ్వాళ అలాంటి వ్యక్తి మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరం. ఒక ఉద్యమ సహచరుడిగా, ఒక టీఆర్ఎస్ కార్యకర్తగా, సహచర శాసనసభ్యుడిగా ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్:- గౌరవసభ్యులు దయచేసి సమయాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడాలని కోరుతున్నాను.

جناب ٹی راجا سنگھ (JANAB T.RAJA SINGH, GOSHAMAHAL CONSTITUENCY):

شکریہ اسپیکر صاحب! آج ایسا بھی وقت آئے گا، ہم نے نہیں سوچا تھا۔ ہمارے رامالنگا ریڈی صاحب جو ایوان اسمبلی میں بالکل میری بائیں جانب بیٹھا کرتے تھے اور ہر مرتبہ کسی نہ کسی موضوع پر بات کیا کرتے تھے، وہ ذاتی طور پر ایک بہت ہی اچھے آدمی تھے۔ کبھی کبھی ہمیں ہدایت بھی دیا کرتے تھے کہ آپ اسمبلی میں اس طرح سے بات کیجئے اور اس طرح سے کام کیجئے۔ چونکہ وہ سینئر تھے اور تین مرتبہ منتخب ہوئے تھے تو ہم سوچتے تھے کہ سینئر لوگوں سے ہمیں صحیح راستہ معلوم ہوگا، یہ سوچ کر جب ہم ان سے بات کرتے تھے تو وہ بہت ہی اچھا جواب دیتے تھے۔ یہ بہت دکھ کی بات ہے کہ وہ آج ہمارے درمیان نہیں ہیں۔ ان کے کام کاج کے بارے میں کئی معزز ممبروں نے بتایا جس کو سن کر بہت ہی خوشی ہوئی۔ ویسے تو اسمبلی میں کئی پارٹیاں ہیں جن کے ممبران یہاں ہاؤز میں آپس میں لڑتے ہوئے نظر آتے ہیں، لیکن ہاؤز کے باہر ایک دوسرے کا دکھ بانٹتے ہیں اور ایک دوسرے کا جہاں تک ہو سکے تعاون کرتے ہیں۔ اس طرح سے محبت کی ایک نشانی رہتی ہے۔ وہ آج ہمارے درمیان نہیں ہیں، یہ بہت ہی دکھ کی بات ہے۔ میں میری پارٹی کی جانب سے ان کے لئے تعزیت کا اظہار کرتا ہوں۔

میں ساتھ ہی ساتھ اسپیکر صاحب سے یہ کہنا چاہوں گا کہ میری پرنب مکھرجی صاحب کے بارے میں بھی مجھے تعزیت کا اظہار کرنا تھا، لیکن شاید آپ نے اس طرف توجہ نہیں دی۔ ان کے لئے بھی میں اپنی پارٹی کی جانب سے تعزیت کا اظہار کرتا ہوں۔ اسی طرح جو دو سابق ارکان اسمبلی آج ہمارے درمیان نہیں ہیں، ان میں ہمارے مہاراج گنج کے سابق رکن اسمبلی سری رام اسوامی صاحب جو وزیر بھی رہ چکے ہیں، ان کے لئے بھی میں تعزیت کا اظہار کرتا ہوں۔ مجھے بات کرنے کا جو موقع دیا گیا، میں دل سے آپ کا شکریہ ادا کرتا ہوں۔ شکریہ۔

శ్రీమతి ఎం.పద్మా దేవేందర్ రెడ్డి (మెదక్): అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ ఈ తీర్మానం మీద మాట్లాడవలసి వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు. చాలా దురదృష్టకరం, చాలా బాధాకరం. గతంలో కూడా వారు అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లి మళ్లీ క్షేమంగా తిరిగి వచ్చారు. కాబట్టి ఈసారి కూడా

అలాగే తిరిగి వస్తారని అనుకున్నాను. కానీ వారి మరణ వార్త అందరినీ కుంగదీసింది. రామలింగారెడ్డి గారు సామాన్య రైతు కుటుంబంలో జన్మించినప్పటికీ మంచి అభ్యుదయ భావాలతో అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి. అభ్యుదయ భావాలు చాలా మందికి ఉంటాయి కానీ వాటిని ఆచరణలో పెట్టరు. రామలింగారెడ్డి గారు మాత్రం అలా కాకుండా ఆచరణలో చూపిన వ్యక్తి. దానికి నిదర్శనం అప్పుడు వరకట్న దురాచారం రక్కసి కోరలు విప్పుతున్న సందర్భంలో తనే ఒక ఆదర్శ వ్యక్తిగా మారి సభా వివాహాన్ని గౌరవ కేసీఆర్ గారు, గౌరవ కాళోజీ గారి సమక్షంలో సభా వివాహాన్ని ఆచరించడమనేది వరకట్న దురాచానికి నిదర్శనంగా మనం భావించవచ్చు. అనేక ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజా సమస్యలను లేవనెత్తిన పేరున్న వ్యక్తిగానే కాకుండా ఒక విలేఖరిగా ఉన్నట్లైతే అనేక సమస్యలను లేవనెత్తి చాలా మందికి న్యాయం చేయగలుగుతాననే ఉద్దేశంతో “ఉదయం” పత్రికలో జర్నలిస్టుగా జాయిన్ అవడం జరిగింది. అంతే కాకుండా ఆ ఉదయం పత్రికలో పని చేసినప్పుడు ప్రజలు ఏ సమ్యస్యనైనా లేవనెత్తితే ఆరోజు అది బ్యానర్ ఐటమ్‌గా వచ్చేది. కాబట్టి చాలా మంది అవగాహన కల్పించుకొని ఆ సమస్యకు పరిష్కారం దిశగా ఆలోచించుకుని వెళ్లేవారు. అలాంటి మంచి స్పూర్తితో రాసిన విలేఖరిగా వారికి మంచి పేరు ఉన్నది. అంతే కాకుండా అప్పుడు రవాణా శాఖ మంత్రిగా మన ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఉన్నప్పుడు జర్నలిస్టులకు ఉచితంగా బస్‌పాస్‌లు కూడా ఇప్పించారు.

అప్పటి ఉద్యమ నాయకుడు గౌరవ కేసీఆర్ గారు సిద్ధిపేట నుంచి వరంగల్‌కు సైకిల్ యాత్రను పెట్టినప్పుడు ఆ యాత్రలో కేసీఆర్ గారితోబాటు నేను కూడా పాల్గొన్నాను. అప్పుడు ఆ విషయాలన్నింటిని పత్రికలలో ప్రచురించి నన్ను అభినందించిన వ్యక్తి రామలింగారెడ్డి గారు. అప్పుడే నాకు ఆ అన్నతో పరిచయం ఏర్పడింది. తదనంతరం 2004లో గౌరవ కేసీఆర్ గారి ఆశీస్సులతో మేమిద్దరం శాసనసభ్యులుగా ఎన్నికై మొట్టమొదట శాసనసభలో అడుగుపెట్టడం జరిగింది. మేమిద్దం ఒక్క జిల్లా కావడం వలన ప్రతి ఉద్యమంలో అంటే రాస్తా రోకోలు కావచ్చు, ధర్నాలు కావచ్చు, పార్టీ ఏ పిలుపునిస్తే ఆ పిలుపు మేరకు మేమందరం కలిసికట్టుగా సమన్వయంతో దానిని విజయవంతం చేయడంలో రామలింగారెడ్డి గారు ముందుండేవారు. సమైక్య వాదులు, సమైక్య ప్రభుత్వాలు అప్పుడు మా మీద చాలా కేసులు పెట్టడం, మమ్మల్ని అరెస్టు చేయడం, ఇబ్బందులు పెట్టడం, ప్రలోభాలకు లోను చేయడం వంటివి ఎన్ని చేసినా కూడా మేం దేనికీ లొంగకుండా ఉండేవాళ్లం. ఒక సందర్భంలో అయితే మా మీద అన్ని పోలీస్ స్టేషన్‌లలో A1గా రామలింగారెడ్డి గారు A2గా నేను ఉండేవాళ్లం, లేదంటే A1గా నేను A2గా రామలింగారెడ్డి గారు ఉండేవారు. గౌరవ కేసీఆర్ గారు నిరాహార దీక్ష చేసిన సందర్భంలో జరిగిన సంఘటనలు గుర్తుకొస్తే ఇప్పటికి కూడా మాకు భయాందోళనలు కలిగిస్తాయి. అలాంటి వాటిని కూడా ఎదుర్కొన్న వ్యక్తులలో రామలింగారెడ్డి గారు ఒకరు. అంతే కాకుండా రైల్ రోకోలు చేసే సందర్భంలో వడియారం, అక్కన్నపేట, మాసాయిపేట వంటి గ్రామాలు నాకు, రామలింగారెడ్డి గారికి కలిసి ఉండేవి. రైల్ రోకో సందర్భంలో మామీద కేసులు పెట్టినప్పుడు ఫైన్ కట్టేసి ఆ కేసును తీసేయించుకుందామని మేం చెబితే రామలింగారెడ్డి గారు ఒప్పుకోకుండా మనం తప్పు చేయలేదు కాబట్టి ఎట్టి పరిస్థితులలో మనం కొట్లాడదామని చెప్పి రైల్ రోకో కేసులల్లో నాలుగైదు సంవత్సరాలు తిరిగాము. నేను డెప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు అంటే 2017 వరకు కూడా ఆకేసు అక్విటల్ అయ్యేంతవరకు తిరిగిన వ్యక్తి. అంటే వారు చాలా ధైర్యం కలిగిన వ్యక్తి. అలాంటి వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం చాలా దురదృష్టకరం.

2008 సంవత్సరంలో గౌరవ కేసీఆర్ గారు ఒక్క మాట చెప్పగానే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్లి ప్రజల మధ్యలో ఉండి ప్రజలందరితో మమేకమై పనిచేసి మళ్లీ ప్రజా ఉద్యమబాట పట్టిన వ్యక్తి రామలింగారెడ్డి గారని నేను గుర్తు చేస్తున్నాను. 2014లో శాసనసభ్యుడిగా ఎన్నికైన తరువాత మంచి హెల్దీ కాంపిటీషన్‌తో మెదక్ నియోజకవర్గం ఏ విధంగా అభివృద్ధి జరిగితే వారి నియోజకవర్గం కూడా ఆ విధంగా అభివృద్ధి కావాలనే ఒక మంచి సమన్వయంతో

ముందుకు సాగారు. మేం ఒకటే జిల్లా కావడం, ఆ తరువాత జిల్లా వేరైనప్పటికి కూడా రామలింగారెడ్డి గారి నియోజకవర్గంలోని రెండు మండలాలు నా నియోజకవర్గంలోకి వచ్చినందున ఆ సందర్భంలో ఆ రెండు మండలాలలను కూడా అభివృద్ధి చేయడంలో మంచి సహకారంతో ముందుకెళ్లిన వ్యక్తి రామలింగారెడ్డి గారని గుర్తుచేస్తున్నాను.

1.10 మ. అంతే కాకుండా మొన్న గౌరవ ముఖ్యమంత్రి గారు కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టును ప్రారంభించిన సందర్భంలో నన్ను, రామ లింగన్నను పిలిచి కాలువలకు ఎటువంటి ఇబ్బందులున్నాయో, ఒకసారి కాలువల చుట్టూ తిరిగి రమ్మనికేసీఆర్ గారు ఆదేశిస్తే, ఒక మాసం అయితే చనిపోతాడనే సందర్భంలో ఇద్దరం కూడా మంత్రి గారితో కలసి దాదాపు 53 కిలోమీటర్లు, ఆ కాలువను పరిశీలించడం జరిగింది. ఆ కాలువను పరిశీలించిన సందర్భంలో ఎదురైన ఇబ్బందులను గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకురావడం జరిగింది. మల్లన్నసాగర్, కొండపోచమ్మ నీళ్లు వస్తే దుబ్బాక నియోజకవర్గం బాగుపడుతుందనే తపన రామలింగారెడ్డి గారిలో ఉండేది. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ద్వారా వచ్చే నీళ్లతో దుబ్బాక నియోజకవర్గంలో పండే పంట పొలాలను చూసేందుకు రామలింగారెడ్డి లేకపోవడం చాలా దురదృష్టకరం.

తప్పకుండా వారి ఆశయాన్ని కొనసాగిస్తూ గౌరవ ముఖ్యమంత్రి గారు వారి నియోజకవర్గాన్ని పూర్తిగా సస్యశ్యామలం చేస్తారనే నమ్మకం రామలింగారెడ్డి గారిలో ఉండేది. భవిష్యత్తులో దానిని తప్పకుండా కొనసాగిస్తారు కాబట్టి, వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని భావిస్తూ వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, జోహార్ రామలింగారెడ్డి గారు, ముగిస్తున్నాను.

శ్రీ దాస్యం వినయ భాస్కర్ (వరంగల్ వెస్ట్):- అధ్యక్షా, కీర్తి శేషులు శ్రీ రామ లింగారెడ్డి గారి గురించి సహచర శాసన సభ్యులు, గౌరవ ముఖ్యమంత్రి గారు వారి మంచితనం గురించి, వారు చేసినటువంటి పని విధానం గురించి, వారి పట్టుదల గురించి చెబుతుంటే, చాన బాధ వేస్తుంది. మొన్న జరిగినటువంటి బడ్జెట్ సమావేశాల్లో వారూ, నేను నా నియోజకవర్గం, వారి నియోజకవర్గం అభివృద్ధి గురించి చర్చించుకోవడం జరిగింది. వారు చనిపోయిన తరువాత వారి గ్రామానికి వెళ్లినప్పుడు అక్కడి ప్రజలు వారి గురించి చాలా గొప్పగా చెప్పుకోవడం గమనించడం జరిగింది. వారు నీతి, నిజాయితీకి, నిబద్ధతకు మారుపేరు అని చెబుతుంటే చాలా గర్వంగా అనిపించింది. వారి మరణ వార్త వినగానే టి.ఆర్.ఎస్. కుటుంబ సభ్యులందరం కూడా దుఃఖ సముద్రంలో మునిగిపోవడం జరిగింది. టి.ఆర్.ఎస్. కుటుంబ సభ్యులే గాక ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలందరు కూడా ప్రత్యేకించి వారు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ ప్రజలందరు కూడా ఒక ఆత్మీయున్ని, ఒక కుటుంబ సభ్యుడిని కోల్పోయిన విధంగా బాధపడటం చూశాను.

అధ్యక్షా, వారికి విద్యార్థి దశనుండే నాయకత్వ లక్షణాలుండేటివి. విద్యార్థి దశలోనే వారి స్వంత గ్రామంలో భగత్‌సింగ్ గారి విగ్రహాన్ని ప్రతిష్టించి, యువకులందరినీ కూడా చేరదీసి ఒక యూత్ క్లబ్‌ను కూడా స్థాపించి ఆ రోజుల్లోనే గ్రామాభివృద్ధి గురించి పాటుపడ్డారని వార్తాపత్రికల్లో చదవడం జరిగింది. సమైఖ్య రాష్ట్రంలో జరిగినటువంటి అన్యాయాల గురించి గానీ, అవినీతి గురించి గానీ, నీళ్లు, నిధులు, నియామకాల్లో జరుగుతున్న అన్యాయాల గురించి తన స్వంత గ్రామంతోపాటు ఇతర పల్లెల్లో కూడా అనేకమందిని, ముఖ్యంగా యువకులను కూడగట్టి తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినటువంటి సందర్భాలు ఎన్నో ఉన్నాయని అక్కడి ప్రజలు చెబుతున్నారు.

అధ్యక్షా, వారు నాకు 2005 నుండి పరిచయం. 2005లో నేను కార్పొరేటర్‌గా గెలిచిన తరువాత, గెలిచిన వారిలో నాతోపాటు ఇంకొక ఐదారుగురం ఉంటిమి. మా అందరినీ కూడా వారు ఫోన్‌లో పలకరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. వార్డుపైన, నగరంపైన, ముఖ్యంగా పార్టీ

బలోపేతం కోసం ఏ తీరుగా పోరాడాలో ఆరోజు మాకు ఫోన్ ద్వారా తెలియజేయడం జరిగింది. వారు టి.ఆర్.ఎస్. పార్టీలోకి రాకముందు లెఫ్ట్ విధానాలకు ఆకర్షితులై, ఆర్.ఎస్.యు.లో కూడా పని చేసినట్లుగా పత్రికల ద్వారా తెలుసుకోవడం జరిగింది. ఆ తదుపరి ఆనాటి ఉద్యమ నేత, గౌరవ ముఖ్యమంత్రి గారు 2001లో పార్టీ స్థాపించిన తరువాత టి.ఆర్.ఎస్. పార్టీలో సభ్యత్వం తీసుకొని క్రియాశీలకంగా, ఒక గులాబి సైనికుడిలాగా పని చేస్తూ అంచలంచెలుగా ఒక శాసనసభ్యుడిగా, ఎస్టిమేట్ కమిటీ ఛైర్మన్‌గా ఎదగడం జరిగింది.

తాను 2006లో మా జిల్లాకు రావడం జరిగింది. అప్పుడు నేను టి.ఆర్.ఎస్. పార్టీ కార్యకర్తగా, ఒక కార్పొరేటర్‌గా వారిని స్వాగతించడం జరిగింది. అయితే వారు ప్రజల పక్షాన ఏవిధంగా ఉన్నారనే ఒక నిదర్శనాన్ని ఈ సందర్భంగా చెప్పాలనుకుంటున్నాను. మా అమ్మమ్మ గ్రామమైన కొండపాక కూడా వారి నియోజకవర్గానికి సంబంధించినదే. అక్కడ మా అమ్మమ్మకు సంబంధించిన స్థలంలో రోడ్డు వేస్తున్నారు, దానిని వేయరాదని వారికి 2006లో వివరించడం జరిగింది. అప్పుడు ఫలానా ఆదివారం మీరు అక్కడికి రమ్మని తాను నాకు చెప్పడం జరిగింది. ఆ ఆదివారం రోజు నేను ఎంతో సంతోషంగా వారి ఇంటికి వెళ్లడం జరిగింది. అక్కడినుండి నన్ను మా అమ్మమ్మ గ్రామం కొండపాకకు తీసుకువెళ్లడం జరిగింది. అక్కడికి వెళ్లాక నేను ఆ రోడ్డు గురించి వివరించాక, వారు ఏమి మాట్లాడకుండానే నన్ను ఒక ప్రభుత్వ పాఠశాలకు తీసుకువెళ్లారు. అక్కడికి, అక్కడున్నటువంటి కొంతమంది వార్డ్ మెంబర్స్‌ని కూడా తీసుకువచ్చి, మనసు నొప్పించకుండా ఎంత ప్రజల పక్షాన ఉన్నారంటే, నన్ను నొప్పించకుండా చివరికీ నాతోనే అక్కడ కొబ్బరికాయ కొట్టించి, ఈ రహదారి ప్రజలకు చాలా అవసరం తమ్మి, దయచేసి మీ కుటుంబ సభ్యులను ఒప్పించి, రోడ్డుకు స్థలం ఇచ్చేయమని నాకు నచ్చచెప్పడం జరిగింది. అంటే, ఒక పార్టీ కార్యకర్త అని చూడలేదు, మంచి మిత్రుడినని చూడలేదు. ప్రజలకు కావాల్సినటువంటి అవసరాలను తీర్చాలని చెప్పి ప్రజల పక్షాన ఉన్నటువంటి గొప్ప నిజాయితీ పరుడు రామలింగన్న అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

నిజంగా కూడా వారి లేని లోటు టి.ఆర్.ఎస్. పార్టీకి, నియోజకవర్గ ప్రజలకు కూడా పెద్ద లోటని ఈ సందర్భంగా తెలియజేసుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని కోరుకుంటున్నాను.

శ్రీ చిలుముల మదన్ రెడ్డి (నర్సాపూర్):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన స్వర్గీయ రామలింగారెడ్డి గారి సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, సహచర శాసనసభ్యులు శ్రీ రామలింగారెడ్డి మృతి సంతాపంపై మాట్లాడుతామని ఎప్పుడు ఊహించలేదు. వారు విద్యార్థి దశ నుండి కూడా ఉద్యమ నాయకుడు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కొరకు వారు ఎన్నో పోరాటాలు చేయడం జరిగింది. వ్యక్తులం కాదు, వ్యవస్థ అంటూ వ్యవస్థను మార్చేందుకు వేరే మార్గాలను కూడా అన్వేషించి తాను నమ్మిన సిద్ధాంతాల వైపు అడుగులు వేసిన సందర్భాలు కూడా మనకు తెలుసు. ఎన్నో ఉద్యమాలు చేసుకుంటూ, రెండు దశాబ్దాలుగా జర్నలిస్ట్‌గా పని చేసి అప్పటి ఉద్యమ నాయకుడైన కేసీఆర్ గారికి ఆకర్షితులై టి.ఆర్.ఎస్. పార్టీలో చేరారు. ఎక్కడ ఏ దౌర్జన్యాలు జరిగినా అక్కడికి రామలింగారెడ్డి గారు వచ్చారంటే అక్కడి వారంతా ఒక అదుపులో ఉండేవారు. ఎన్నో ధైర్యసాహసాలతో వారు నమ్మిన సిద్ధాంతాలతో ఎన్నో కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లారు. అప్పటి ఉద్యమాలకి రామలింగారెడ్డి గారు వస్తున్నారంటేనే కార్యకర్తల్లో ఎంతో ధైర్యం నిండేది.

తెలంగాణ రాష్ట్ర అవతరణలో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎన్నో ఇబ్బందులను వ్యాసాల ద్వారా తెలియజేస్తూ రామలింగారెడ్డి గారు ఎంతో ప్రసిద్ధిగాంచారు. రామలింగారెడ్డి గారు అంచలంచెలుగా ఎదిగి 2004లో కేసీఆర్ గారి ఆధ్వర్యంలో శాసనసభ్యుడిగా గెలుపొందిన తరువాత, ఉద్యమ

నేతగా ఉండి పార్టీ పిలుపివ్వగానే ఒక తృణప్రాయంగా శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి మళ్లీ 2008లో అత్యధికమైన మెజారీటితో గెలవడం జరిగింది. ఏ సమస్య వచ్చిన గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి సిద్దిపేట నియోజకవర్గం ఏవిధంగా అభివృద్ధి అవుతుందో, దుబ్బాక నియోజకవర్గాన్ని కూడా అదేవిధంగా అభివృద్ధి చేయాలని నిజంగా కూడా పోటీపడి ఎన్నో కార్యక్రమాలు చేసుకుంటూ గౌరవ ముఖ్యమంత్రి గారి అండదండలతోటి ముందుకు వెళుతుండేడి వారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కోటీ ఇరవై ఏడు లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్న సందర్భంలో వారు లేకపోవడం చాలా బాధాకరం.

1.20 మ. ఇటువంటి మంచి సమయంలో వారు లేకుండా పోవడం చాలా దురదృష్టకరం. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని వారు చూడలేకపోవడం ఎంతో బాధాకరం. మాకు కూడా వారు ఎంతో ఆదర్శవంతంగా ఉండేవారు. నాకంటే వారిది చిన్న వయసే అయినా, నేను వారిని రామలింగన్నా అని సంభోదించేవాడిని. వారు కూడా నన్ను అదే విధంగా గౌరవించేవారు. అభివృద్ధి కార్యక్రమాలలో వారి సలహాలను మేము తీసుకుంటూ, వారు కూడా మమ్మల్ని సంప్రదిస్తూ, ఎంతో నేర్పుతో వారు పనిచేసేవారు. ముఖ్యమంత్రిగారికి ఎంతో అండదండగా ఉన్నారు. వారితో పాటు ఉద్యమాల్లో కూడా పాల్గొన్నారు. వ్యక్తిగత జీవితంలో కూడా ఆదర్శవంతంగా నిలిచేటట్లు ఆదర్శ వివాహం చేసుకోవడమే కాదు, వారి పిల్లలకు కూడా ఆదర్శ వివాహాలు జరిపించారు. అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా ప్రతి ఒక్కరి దగ్గరకు వెళ్లి, పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకునేవారు. వారి నియోజకవర్గ సమస్యలే కాదు, తెలంగాణ సమస్యలను కూడా వారు అసెంబ్లీలో ప్రస్తావించి, వాటి సమస్యకు ఎంతో కృషిచేశారు. వారి మరణం రాష్ట్రానికి తీరని లోటు. వారు లేకపోవడం శాసనసభకే కాదు, తెలంగాణ రాష్ట్రానికే నష్టంగా నేను భావిస్తున్నాను. భగవంతుడు వారి ఆత్మకు శాంతి కలిగించాలని, వారి కుటుంబానికి ప్రగాఢమైన సానుభూతిని తెలుపుతూ, సెలవు తీసుకుంటున్నాను. జై తెలంగాణ.

శ్రీమతి గొంగిడి సునీత (ఆలేరు):- అధ్యక్షా, స్వర్గీయ శ్రీ రామలింగారెడ్డిగారి సంతాప తీర్మానాన్ని నేను బలపరుస్తూ, మాట్లాడే అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. వారు మరణించడానికి నాలుగు రోజుల ముందు నేను గౌరవ మంత్రి కేటీఆర్ గారి దగ్గరకు ఒక పనిమీద వెళ్లినప్పుడు వారు చెప్పారు- రామలింగన్న ఆరోగ్య పరిస్థితి బాగాలేదు, వారికి సెప్టిసీమియా వ్యాధి ఉందని చెప్పినప్పుడు నేను తీవ్ర దిగ్భ్రాంతికి గురైనాను. అప్పుడు నాకు అసెంబ్లీలో వారు కూర్చుంటున్న కుర్చీనే గుర్తుకొచ్చింది. ఎప్పుడూ కూడా అక్కడ నుండి సభా కార్యక్రమాలు గమనిస్తుండేవారు. వారు మాకంటే చాలా సీనియర్ సభ్యులు. నాతో వారు అక్కా ఇలా ఉండాలి, మీరు ఇలా అంశాలను ప్రస్తావించండి, ఈ పాయింట్ మీద మాట్లాడితే బాగుంటుంది అని సూచనలు చేసేవారు. ఎప్పటికప్పుడు మమ్మల్ని వారు ఉత్సాహపరుస్తుండేవారు.

ఇంతకుముందు మాట్లాడిన నా తోటి సభ్యులు చాలా విషయాలు, వారి అనుభవాలు చెప్పారు. వారితో నాకు చాలా తక్కువ పరిచయం ఉన్నప్పటికీ, వారి పట్ల నాకు అమితమైన గౌరవం ఉన్నది. 2014లో మెదక్ పార్లమెంటు ఉప ఎన్నికలో కొత్త ప్రభాకర్‌రెడ్డిగారు పోటీ చేస్తున్న సమయంలో, ముఖ్యమంత్రిగారు నాకు దౌలతాబాద్ మండలానికి పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడం జరిగింది. నేను అక్కడికి వెళ్లినప్పుడు రామలింగారెడ్డిగారు నన్ను ఒక ఆడబిడ్డలాగా గొప్ప గౌరవంతో రిసీవ్ చేసుకుని, పార్టీ నాయకులని పిలిచి, నన్ను పరిచయం చేసి, అక్క మీతోపాటు ఇక్కడే ఉంటుంది. ఇది తన మాటకు, తన పనికి సంబంధించిన విషయం కాబట్టి, మీరు అక్క మాట నిలబెట్టాలి, మంచి మెజారిటీ ఇచ్చి, అక్కకు గౌరవం తీసుకురావాలని ఆయన ఆనాడు మాట్లాడిన మాటలు నేను ఎప్పటికీ మరిచిపోలేను. ఆడబిడ్డ పట్ల అంత గౌరవ భావాన్ని కలిగిన ఒక గొప్ప వ్యక్తిని మనం కోల్పోవడం చాలా బాధాకరం. ఈ రోజు ఆ నియోజకవర్గ ప్రజలకుగాని, తెలంగాణకు గాని, టిఆర్ఎస్ పార్టీకిగాని ఆయన లేకపోవడం తీరని లోటుగా నేను భావిస్తున్నాను. ఆయన జీవితం అంతా

పేద వర్గాల ప్రజల కొరకే పనిచేశారని నేను దౌలతాబాద్ మండలంలో ఉన్నప్పుడు స్వయంగా తెలుసుకున్నాను. ముఖ్యంగా పేద ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం చాలా గొప్పది. దాన్ని ప్రజలందరూ కూడా గుర్తించడం జరిగింది. జర్నలిస్టుగా ఆయన మంచి పేరు గడించడమే కాకుండా, తాను శాసనసభ్యునిగా ఉన్నప్పటికి కూడా, నాలుగుసార్లు గెలుపొందినప్పటికీ ఎంతో నిరాడంబరంగా ఉంటూ, ప్రతి ఒక్కరితో సత్సంబంధాలను కలిగి, మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రగతిశీల భావాలను కలిగి ఉండడమే కాదు, వాటిని ఆచరణలో పెట్టిన వ్యక్తిగా కూడా గుర్తింపు తెచ్చుకున్నారు. నేను గమనించిన మరొక విషయం ఏమిటంటే వారు సాదాసీదా జీవితాన్ని గడపడానికి ఇష్టపడేవారు. వారు ఆదర్శ వివాహం చేసుకోవడమే కాకుండా, తమ పిల్లలు కూడా అదే బాటలో నడిచే విధంగా తండ్రిగా తను ప్రోత్సహించడం ఎంతో గొప్ప విషయం. వారు దినపత్రిల్లో అనేక వ్యాసాలు రాసేవారు. తనలో ఉన్న భావాలను తెలంగాణ ప్రజలందరికీ తెలిసే విధంగా వారు అనేక ఆర్టికల్స్ రాస్తుండేవారు. వాటిని నేను తప్పకుండా చదివేదాన్ని. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రసాధన కొరకు వారి వ్యాసాలు ఎంతో ఆలోచనాత్మకంగా ఉండేవి. వారు చనిపోవడానికి వారం రోజుల ముందు కూడా వారి ఆర్టికల్స్ పత్రికల్లో నేను చదివాను. వారు ఆసుపత్రిలో చేరిన వార్తను ముందు నేను నమ్మలేకపోయాను. వారి ఆర్టికల్స్‌లో తెలంగాణ ప్రజల ఆకాంక్ష, అవి ఏ విధంగా నెరవేరుతున్నాయనేది వారి వ్యాసాల్లో చాలా స్పష్టంగా రాశారు. వారు తమ నియోజక వర్గ ప్రజలకు సేవలను అందించే విషయంలోగాని, దుబ్బాక మండలంలో గౌరవ ముఖ్యమంత్రిగారు కేసీఆర్‌గారు చదువుకోవడం, ఆ పాఠశాల అభివృద్ధి కొరకు రామలింగారెడ్డిగారు కృషి చేయడం, నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట కొరకు ముఖ్యమంత్రిగారి వెంటపడి, గోదావరి జలాలను తీసుకురావడం కూడా చాలా గొప్ప విషయం. నియోజక వర్గ ప్రజలు ఎప్పటికీ కూడా వారిని మరిచిపోరని నేను భావిస్తున్నాను.

ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రిగారికి ఒక చిన్న విజ్ఞప్తి చేస్తున్నాను. దుబ్బాక నియోజక వర్గానికి వారు చేసిన సేవలకు గుర్తుగా అక్కడ స్మారక ప్రాంతాన్ని ఏర్పాటుచేసి, దానిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రిగారిని సభాముఖంగా కోరుతూ, అదే విధంగా దుబ్బాకలో ఒక ప్రభుత్వ కార్యాలయానికి లేదా భవనానికి వారి పేరు పెట్టాలని సభా పక్షాన, ఆ నియోజకవర్గ ప్రజల పక్షాన విజ్ఞప్తి చేస్తూ, సెలవు తీసుకుంటున్నాను. అదే విధంగా వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని, వారి ఆత్మకు శాంతిని కలిగించాలని దైవాన్ని కోరుతూ, ముగిస్తున్నాను.

శ్రీ ఈటల రాజేందర్:- అధ్యక్షా, 18 సంవత్సరాల పాటు వారితో ఉద్యమంలో కలిసి పనిచేశాను. సహచర శాసనసభ్యునిగా కూడా వారితో నాకు ఎంతో అనుభవం ఉంది. వారిది ఒక విలక్షణమైన వ్యక్తిత్వం. చాలామంది ఎదుగుతున్న కొద్ది మాటలు మారుస్తుంటారు. కాని వారు ఎంత ఎత్తుకి ఎదిగినా, నమ్మిన సిద్ధాంతం కొరకు కట్టుబడిన వ్యక్తి. ప్రలోభాలను తట్టుకొని, ఉద్యమ బావుటాని ఎగురవేశారు. ఈ శాసనసభలో మాకు ఎన్నెన్ని అనుభవాలో. పోలీసు స్టేషన్లలో ఎన్ని రోజులు గడిపామో మాకు తెలుసు.

1.30 మ. ఏది ఏమైనప్పటికీ, నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కట్టుబడి ఆచరించిన మహనీయుడు రామలింగారెడ్డిగారు. దుబ్బాకలో ఏమి జరుగుతుందని రామలింగారెడ్డిగారిని నేను అడిగినప్పుడు, నాకేముందన్నా నాకు ముఖ్యమంత్రిగారి అండ ఉంది కాబట్టి, నా సకల సమస్యలు వారే తీరుస్తారని చెప్పి, దుబ్బాకలో ఒక పాఠశాల భవన నిర్మాణం చేసే సందర్భంలో చెప్పారు. దుబ్బాక ప్రాంతం నీళ్ల కోసం ఎంత ఘోష పడేదో అందరికీ తెలుసు. ఈ రోజు రామలింగారెడ్డిగారు లేకపోయినప్పటికీ, దుబ్బాక నియోజకవర్గంలోని రైతాంగానికి నీళ్లు వచ్చి ఆ ప్రాంతమంతా సశ్యశ్యామలంగా మారుతుందని భరోసా వ్యక్తం చేసిన వ్యక్తి రామలింగారెడ్డి గారు. వారితోబాటు ఇదే సభలో మాతో పని చేసిన కావేటి సమ్మయ్యగారు, రత్నాకర్‌రావు గారు మరియు

సున్నం రాజయ్య గారికి కూడా తీర్మానం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకుంటున్నాను.

శ్రీ రసమయి బాలకిషన్ (మానకొండూరు) :- అధ్యక్షా, ఈ సభలో రామలింగారెడ్డి గారు సుదీర్ఘంగా మాట్లాడినటువంటి సందర్భాలు చాలా చూశాము. నాలాగా కొత్తగా వచ్చిన శాసనసభ్యులు వారి మాటల్లోని స్ఫూర్తిని పొంది, వారిలాగానే మాట్లాడాలనే ప్రయత్నం చేశాము. అంత గొప్పగా శాసనసభలో మాట్లాడే గొప్ప వ్యక్తి మరణం గురించి, ఈ సభలో మాట్లాడుకోవడం అనేది చాలా బాధాకంగా ఉంది. నేను వారితో సుదీర్ఘంగా ప్రయాణం చేసిన వాడిని. 30 సంవత్సరాలపాటు వారితో కలిసి నడిచిన వాడిని. హోమ్ క్వారెంటైన్‌లో ఉండడం వలన వారి కడసారి చూపుకు నేను నోచుకోలేకపోయాను. వారి గురించి శాసనసభలో మాట్లాడే అవకాశం నాకు కల్పించినందుకు ముఖ్యమంత్రిగారికి, సభాపతిగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ రామలింగారెడ్డిగారి జీవితం భవిష్యత్ తరాలకు ఒక పాఠ్యాంశం వంటిది. ఎందుకంటే, చిన్నప్పటి నుండే, ఉగ్గుపాలతోనే ఉద్యమాలను నేర్చుకున్నవాడు. పెరుగుతున్న క్రమమంతా తన చుట్టూ ఉన్నటువంటి సమాజం గురించి ఆలోచించిన వాడు. తాను 10వ తరగతి చదువుతున్న సమయంలోనే బాలల సంఘంలో చేరి, సమాజం కోసం గోడల మీద రాతలు రాసిన వ్యక్తి శ్రీ రామలింగారెడ్డిగారు. అటువంటి వ్యక్తి, నేను మరియు గౌరవ ముఖ్యమంత్రిగారు దుబ్బాక పాఠశాలలో చదువుకున్న విద్యార్థులం.

మన ముఖ్యమంత్రిగారు పాఠశాల విద్య ఎక్కడైతే చదువుకున్నాడో ఆ పాఠశాల కళాశాలగా మారిన సందర్భంలో నువ్వు, నేను అదే కళాశాలలో చదువుకోవడం అనేది మనకు దక్కిన గొప్ప అదృష్టంగా భావించుకోవాలని ఆయన ఎప్పుడూ అంటూ ఉండేవాడు. గౌరవ ముఖ్యమంత్రిగారు దుబ్బాకలో చదువుకున్నారు. కాబట్టే, దుబ్బాక అంటేనే అభివృద్ధికి నోచుకోని ప్రాంతం. ప్రతిరోజూ అక్కడ అనేక రూపాల్లో పోరాటాలు జరిగే సందర్భాల్లో దుబ్బాక నియోజకవర్గంలోని విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి, ఇక్కడి నుండి ఉన్నత విద్యావంతులు తయారవ్వాలనే గొప్ప ఆలోచన చేశారు. నాకు తెలిసి సిద్ధిపేటలో కూడా అంత గొప్ప పాఠశాల లేదు. ఆ పాఠశాలను గొప్పగా నిర్మించాలనే ముఖ్యమంత్రిగారి సంకల్పం నెరవేరిన తరువాత, నేను రామలింగారెడ్డిగారు శాసనసభలో ఒకే బెంచీ మీద కూర్చున్నప్పుడు, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి, ఆ సమ్మేళనానికి మన ముఖ్యమంత్రిగారే అధ్యక్షత వహించాలని చాలా సందర్భాల్లో గుర్తు చేసుకునేవాడు. 1987 సంవత్సరంలో దుబ్బాక కళాశాలకు రామలింగారెడ్డిగారు సెక్రటరీగా పని చేసినప్పుడు, నేను కళాశాల ఛైర్మన్‌గా పని చేశాను. అప్పుడు వారు జర్నలిస్ట్‌గా కూడా పని చేసేవాడు. ఎంత విచిత్రమైన పరిస్థితి అంటే, అప్పటి సమైక్యాంధ్రలో మాట మాట్లాడే అవకాశం కాదు కదా, చీమ చిటుక్కుమంటే కూడా ఎన్‌కౌంటర్‌లా తుపాకుల శబ్దాలు వినపడే సందర్భంలో వారు ఒక ఆర్టికల్ వ్రాశారు.

మా ఊరికి నీళ్లెప్పుడు వస్తాయో మేము అడగము
మా ఊరికి బస్సెప్పుడు వస్తుందో మేము అడగము
మా ఊరికి కరెంటెప్పుడు వస్తుందో మేము అడగము
కానీ, మా ఊరికి పోలీసు జీపు ఎప్పుడు వస్తుందో
చెప్పండి సారూ,

అని వారు ఒక ఆర్టికల్ వ్రాయడం జరిగింది. ఆ ఆర్టికల్ తరువాత అప్పుడు ఉన్నటువంటి పరిస్థితుల్లో, వారి మీద "టాడా" చట్టాన్ని ఉపయోగించిన సందర్భం కూడా మనందరికీ తెలుసు. ఒకానొక సందర్భంలో ఎన్‌కౌంటర్ అయిపోతాడేమో అనే ఉత్కంఠ ఎక్కడ చూసినా కనపడేది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొదటిసారి జర్నలిస్ట్ మీద "టాడా" కేసు పెట్టబడింది. జర్నలిస్ట్‌గా ఉండి మొదటగా "టాడా" కేసు మోపబడ్డ వ్యక్తి శ్రీ రామలింగారెడ్డి గారు. ఈ రోజుల్లో నువ్వు ఏటికి ఎదురీదుతున్నావు. ఈ విధంగా ఉంటే కష్టమని అందరూ చెప్పే సందర్భంలో, ప్రజల కోసం నాకన్నా

ముందు మరణించిన వాళ్లు చాలా మంది ఉన్నారు. వాళ్ల ఆశయాలన్నీ నాలో ఉన్నాయి. ప్రజల కోసం మరణించిన వాడికి ఎప్పుడూ మరణం ఉండదు. వాడు ప్రజల్లో చిరస్థాయిగా ఉంటాడని చెప్పి ఈనాడు తన గురించే తాను చెప్పుకునే విధంగా శ్రీ రామలింగారెడ్డిగారి రాతలు కనపడుతున్నాయి. చాలా మంది నేతలు వేదికల మీద చెప్తూ ఉంటారు. కానీ, ఆచరించేవాళ్లు తక్కువ మంది ఉంటారు. ఆ తక్కువ మందిలో ఒక్కడు మన రామలింగారెడ్డిగారు. ఇంతకు ముందు గౌరవ ముఖ్యమంత్రిగారు గుర్తు చేసిన విధంగా, తను ఆదర్శ వివాహాన్ని చేసుకోవడం అంటే, ఏదో ఉన్నత కుటుంబానికి సంబంధించిన అమ్మాయిని వివాహం చేసుకుని, ఆదర్శ వివాహం అని స్టేజ్ మీద చెప్పలేదు. వివాహం కూడా చేసుకోలేనటువంటి, అత్యంత కడు పేదరికాన్ని అనుభవిస్తున్న కుటుంబంలోని వ్యక్తి అయిన సుజాతమ్మను ఆ రోజుల్లో, ఆదర్శంగా వివాహం చేసుకున్నారు. ఆనాటి శాసనసభ్యులుగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రిగారు మరియు కాళోజీరావుగారి చేతుల మీదుగా వివాహం జరిగింది. వివాహాలు చాలా మంది చేసుకుంటారు. ఆదర్శ వివాహం జరిగిన నాలుగు రోజుల్లో విభేదాలు రావడం మనమందరం చూశాం. కానీ, రామలింగారెడ్డిగారు సుజాతమ్మను ఎంత ఇష్టపడి చేసుకున్నాడో, అంతే ఇష్టంతో చివరివరకూ ఆమెతో కలిసి జీవించినటువంటి ఆదర్శమైన భర్తగా తన జీవితాన్ని కొనసాగించాడు. తన పిల్లలకు కూడా ఆదర్శవంతమైన జీవితాన్నే నేర్పించాడు. చాలా మంది తమ పిల్లలను ఉన్నత కళాశాలల్లో చదివించాలి. ఎమ్మెల్యే అయిన తరువాత మన పిల్లలు గొప్పగా ఉండాలని చాలా మంది కోరుకుంటారు. కానీ, ఇది ప్రజలు ఇచ్చిన గౌరవంగా వారు భావించి, ప్రజల పిల్లలు ఏ విధంగా పెరుగుతారో, మన పిల్లలు కూడా అదే విధంగా పెరగాలనే ఉద్దేశంతో, మన పిల్లలను ప్రజల జీవితాల్లో భాగంగా చేసుకుని పెంచాలనే ఆలోచన చేశారు. తాను ఏ విధంగా ఆదర్శ వివాహం చేసుకున్నాడో తన పిల్లలకు కూడా అదే ఆదర్శ వివాహాన్ని చేసిన గొప్ప వ్యక్తి, ఆదర్శప్రాయుడు రామలింగారెడ్డిగారు.

మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో వారు నేను కలిసి ఒకే వేదిక మీద కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చేవాళ్లము. ఆయనకు పాట రాకపోయినా మాతో కలిసి గొంతు కలిపేవాడు. అంటే, ప్రజల కోసం భాగస్వామ్యమైన ఉద్యమం నుండి తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో కూడా మాకు అనేక రంగాలలో ఆదర్శంగా నిలబడిన వ్యక్తి గురించి మాట్లాడడం అనేది చాలా బాధాకరం. అయినప్పటికీ, గౌరవ శాసనసభ్యురాలు శ్రీమతి గొంగిడి సునీతగారు శ్రీ రామలింగారెడ్డిగారి పేరును దుబ్బాక నియోజకవర్గంలో ఉండే విధంగా చూడమని చెప్పారు. మొదటి నుండీ రామలింగారెడ్డిగారు అంటే ముఖ్యమంత్రిగారికి చాలా ఇష్టం. ఎందుకంటే, ఉద్యమం జరిగిన సందర్భంలో ముఖ్యమంత్రిగారు రామలింగారెడ్డిగారికి ఏ మాట చెప్పినా తు.చ. తప్పకుండా అమలు చేసి ముఖ్యమంత్రిగారి అడుగుజాడల్లో నడిచిన వ్యక్తి కాబట్టి, వారి పేరు దుబ్బాక నియోజకవర్గంలో ఉండే విధంగా ఆలోచన చేస్తారని మనస్పూర్తిగా భావిస్తున్నాను.

కనుపాప చూపుల్లో, కన్నీటి పాటల్లో, వెన్నెల దీపాలకు
వెలుగులైనోడు

కనుపాప చూపుల్లో, కన్నీటి పాటల్లో, వెన్నెల దీపాలకు
వెలుగులైనోడికి,

ఏటీ పాయల నీటి ఊటలా జోహారు.

గట్లమీద గడ్డి, చిలుకలా జోహారు. చిలుకలా
జోహారు, వరి మొలకలా జోహారు.

రామలింగన్న నీకు నా జోహారు.

1.40 మ. **మిస్టర్ స్పీకర్:-** సిద్ధిపేట జిల్లా దుబ్బాక శాసనసభ నియోజకవర్గ సభ్యులు, శ్రీ సోలిపేట రామలింగారెడ్డి గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. శ్రీ సోలిపేట రామలింగారెడ్డిగారు 1961, అక్టోబర్ 2వ తేదీన దుబ్బాక మండలం చిట్టాపూర్ గ్రామంలో

జన్మించారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను ఏర్పరచుకున్నారు. ఉదయం, వార్త దినపత్రికలలో జర్నలిస్టుగా పని చేస్తూ జిల్లా స్థాయి నేతగా ఎదిగారు. టి.ఆర్.ఎస్.పార్టీ ఆవిర్భావంతో పార్టీలో సామాన్య కార్యకర్తగా చేరి, తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. వీరు మూడు పర్యాయములు శాసనసభకు ఎన్నికయ్యారు. 2004 సంవత్సరంలో దొమ్మాట నియోజకవర్గం నుండి ఎన్నికైన వీరు 2008వ సంవత్సరములో పార్టీ ఆదేశానుసారం శాసన సభ్యత్వానికి రాజీనామ చేసి, తదనంతరం జరిగిన ఉప ఎన్నికలలో తిరిగి గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, 2014, 2018 సంవత్సరములలో జరిగిన ఎన్నికలలో దుబ్బాక నియోజక వర్గం నుండి రెండు పర్యాయాలు శాసనసభకు ఎన్నికయ్యారు. వీరు 2014 నుండి 2018 వరకు తెలంగాణ శాసనసభకు ఎన్నికయ్యారు. వీరు 2014 నుండి 2018 వరకు తెలంగాణ శాసన మండలి అంచనాల కమిటీకి అధ్యక్షులుగా పనిచేశారు. 2019 సంవత్సరంలో కూడా వీరు రెండవసారి అంచనాల కమిటీకి అధ్యక్షులుగా ఎంపికయ్యారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరు 2020, ఆగస్టు 6వ తేదీన మరణించారు. వీరి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ, రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం.

(సభ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించింది)

సంతాప ప్రతిపాదనలు

మిస్టర్ స్పీకర్:- 1.కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ శాసనసభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ కావేటి సమ్మయ్య గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. శ్రీ కావేటి సమయ్యా గారు 2009 నుండి 2013 వరకు సిర్పూర్ శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణ సాధనలో భాగంగా పార్టీ ఆదేశానుసారం ఫిబ్రవరి, 2010 సంవత్సరములో శాసన సభ్యత్వానికి రాజీనామ చేసిన వీరు, జూలైలో జరిగిన ఉప ఎన్నికల్లో తిరిగి విజయం సాధించారు. వీరు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధన కోసం కాగజ్‌నగర్ పట్టణంలో సాగిన 300 రోజుల రిలే దీక్ష శిబిరాన్ని ముందుండి నడిపించారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరు 2020, ఏప్రిల్ 9వ తేదీన మరణించారు. వీరి వయస్సు 63 సంవత్సరాలు.

2. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బుగ్గారం శాసనసభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ జువ్వాడి రత్నాకర్ రావు గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. శ్రీ జువ్వాడి రత్నాకర్ రావు గారు 1989లో బుగ్గారం శాసనసభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా గెలుపొందారు. తిరిగి 1999 నుండి 2003 వరకు మరియు 2004 నుండి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎంపికై అదే నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. వీరు తిమ్మాపూర్ సర్పంచ్‌గా సుదీర్ఘకాలం సేవలను అందించారు. 1970లో వీరు ధర్మపురి దేవస్థానం ఛైర్మన్‌గా ఉండి ఆలయాభివృద్ధికి ఎంతోపాటుపడ్డారు. ధర్మపురి సంస్కృతాంధ్ర కళాశాలకు అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1980-1981 లో వీరు జగిత్యాల పంచాయతి సమితి అధ్యక్షుడిగా పని చేశారు. వీరు 2007 నుండి 2009 వరకు డా.వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారి మంత్రివర్గంలో దేవాదాయ, ధర్మాదాయశాఖ, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్‌ల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. వీరు 2020, మే 10వ తేదీన మరణించారు. వీరి వయస్సు 92 సంవత్సరాలు.

3. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు శాసనసభ నియోజకవర్గం మాజీసభ్యులు శ్రీ నల్లారి పోచయ్యగారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని

తెలియజేస్తున్నది. శ్రీ నల్లూరి పోచయ్యగారు 1978 నుండి 1983 వరకు ఆలేరు శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరు 2020, మే 14వ తేదీన మరణించారు. వీరి వయస్సు 82 సంవత్సరాలు.

4. హైదరాబాద్ జిల్లాలోని మహారాజ్‌గంజ్ శాసనసభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ పి.రామస్వామిగారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. శ్రీ పి.రామస్వామి గారు 1983 నుండి 1984 వరకు మరియు 1994 నుండి 1999 వరకు మహారాజ్‌గంజ్ శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 1960 సంవత్సరంలో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన వీరు 1964 సంవత్సరంలో కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 1969లో జరిగిన తెలంగాణ తొలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. శ్రీ రామస్వామి గారు శ్రీ నాదెండ్ల భాస్కర్‌రావుగారి మంత్రివర్గంలో సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరు 2020, జూలై 9వ తేదీన మరణించారు. వీరి వయస్సు 87 సంవత్సరాలు.

5. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం శాసనసభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ మస్కు నర్సింహగారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. శ్రీ మస్కు నర్సింహ గారు 2004 నుండి 2008 వరకు ఇబ్రహీంపట్నం శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. వీరు 1994లో చింతుల్ల ఎం.పీ.టి.సీ.గా పని చేశారు. వీరు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా కొనసాగారు. వీరు పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషిచేశారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేనిది కృషిచేశారు. వీరు 2020, జూలై 27వ తేదీన మరణించారు. వీరి వయస్సు 45 సంవత్సరాలు.

6. హైదరాబాద్ జిల్లాలోని ఆసిఫ్‌నగర్ శాసనసభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ బి.కృష్ణగారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. శ్రీ బి. కృష్ణగారు 1978 నుండి 1983 వరకు ఆసిఫ్‌నగర్ శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. వీరు డా.చెన్నారెడ్డిగారి మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రికి పార్లమెంటరీ సెక్రటరీగా పనిచేశారు. 1969 సంవత్సరంలో జరిగిన తెలంగాణ ఉద్యమంలో వీరు చురుకుగా పాల్గొన్నారు. వీరు తమ నియోజకర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరు 2020, జూలై 27వ తేదీన మరణించారు. వీరి వయస్సు 87 సంవత్సరాలు.

7. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం శాసనసభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ సున్నం రాజయ్యగారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. శ్రీ సున్నం రాజయ్యగారు 1999 నుండి 2003 వరకు, 2004 నుండి 2009 వరకు మరియు 2014 నుండి 2018 వరకు మూడు సార్లు భద్రాచలం శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 1979లో సి.పి.ఐ(ఎం.) లో చేరిన వీరు, 1988లో వరరామచంద్రాపురం మండలం చిన్నమట్టపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. వీరు నిరాడంబరంగా ఉంటూ సామాన్యులతో కలిసిపోయే వారు. అధికారులతో కూడా చాలా సన్నిహితంగా వ్యవహరిస్తూ, నియోజకవర్గ పలు సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారు. వీరు భద్రాచలం నియోజకవర్గంలోని వివిధ ప్రాజెక్టులు, తాగు,సాగునీరు, విద్యా, వైద్యం, రహదారులు, తదితర సమస్యలపై పలుమార్లు అసెంబ్లీని వేదికగా చేసుకొని తన వాణిని వినిపించారు. వీరు తమ నియోజకర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. వీరు 2020, ఆగస్టు 3వ తేదీన మరణించారు. వీరి వయస్సు 59 సంవత్సరాలు.

8. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి శాసనసభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ ఎడ్మ కిష్టారెడ్డిగారి మృతి పట్ల ఈ సభ

తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. శ్రీ ఎడ్మ కిష్టారెడ్డిగారు 1994 నుండి 1999 వరకు మరియు 2004 నుండి 2009 వరకు కల్వకుర్తి శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. వీరు 1973, 1981 సంవత్సరాలలో కల్వకుర్తి సర్పంచ్‌గా, 1987 సంవత్సరంలో కల్వకుర్తి మండలాధ్యక్షుడిగా ఎన్నికైనారు. శ్రీ కిష్టారెడ్డిగారు సామాజికసేవా దృక్పథంలో పనిచేసే సామాజిక స్పృహ కలిగిన నాయకుడిగా ప్రజాభిమానాన్ని సంపాదించుకున్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేశారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరు 2020, ఆగస్టు 18వ తేదీన మరణించారు. వీరి వయస్సు 74 సంవత్సరాలు.

1.50 మ. 9. కరీంనగర్ జిల్లాలోని మేడారం శాసనసభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ మాతంగి నర్సయ్య గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

శ్రీ మాతంగి నర్సయ్య గారు 1983 నుండి 1984 వరకు, 1989 నుండి 1994 వరకు మరియు 1999 నుండి 2003 వరకు మేడారం శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. వీరు శ్రీ నాదెండ్ల భాస్కర రావు గారి మంత్రి వర్గంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. వీరు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరు 2020, సెప్టెంబరు 1వ తేదీన మరణించారు. వీరి వయస్సు 76 సంవత్సరాలు.

వీరి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటిద్దాం.

(సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది.)

MR.SPEAKER:- The House is adjourned to meet at 11:00 a.m., tomorrow i.e., 8th September, 2020.

(The House then adjourned at 1:51 p.m. to meet again at 11.00 a.m., on Tuesday, the 8th Day of September, 2020)

* * *

"Published under Rule 347 of the Rules of Procedure and Conduct of
Business in the Telangana Legislative Assembly and Printed
at Assembly Press, Public Gardens, Hyderabad."